జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 127 హైదరాబాద్, ఫిబ్రవరి 24 బుధవారం 2021 8 పేజీలు వెల : 5.00

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ




హైదరాబాద్, ఫిబ్రవరి 23,ఫిబ్రవరి 23, ప్రజాపాలన ప్రతినిధి :రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నిక రసవత్తరంగా మారాయి.. హేమా హేమీలు భరిలో ఉండడంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ లు ఎవరికి దక్కుతాయనేది అసక్తిని రేపుతుంది..పీవీ నరసింహారావు కూతురు కు టిఆర్ఎస్ టికెట్ ఇవ్వడం తో హైదరాబాద్ ,రంగారెడ్డి ,మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు నెలకొన్నాయి.. బీజేపీ ,కాంగ్రెస్ లకు చెక్ పెట్టేందుకు పీవీ కుటుంబానికి టిక్కెట్ ఇవ్వడం తో ఆసక్తి కరంగా మారింది. హైదరాబాద్ -రంగారెడ్డి -మహబూబ్ నగర్ , ఖమ్మం -నల్గొండ -వరంగల్ గ్రాడ్యుయేట్ స్థానాల నామినేషన్ గడువు ముగియనుంది... హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ స్థానాన్ని ఎప్పుడు గెలవని టిఆర్ఎస్ సరికొత్త వ్యూహం తో ముందుకెళ్తుంది.అసలు ఇక్కడ అభ్యర్థినే పెట్టారు.ఎన్నికల్లో పోటీ చేయరు అన్న ప్రచారానికి గులాబీ బాస్ చెక్ పెట్టారు. ఇతరుల కే మద్దతు తెలుపుతారని భావించినప్పటికీ అభ్యర్థి ని కరారు చేసింది.. అయితే ముందు గా టిక్కెట్ కోసం ప్రయత్నించిన ఆశావహులెవరికీ కాకుండా మాజీ ప్రధాని పీవీ కూతురు వాణీదేవికి టిక్కెట్ ఇవ్వడం తో ఈరోజు నామినేషన్ దాఖలు చేసారు..అయితే పీవీ నరసింహారావు కాంగ్రెస్ పార్టీ కి సంబంధించిన నేత ఆయన కూతురు కు టిఆర్ఎస్ టిక్కెట్ ఇవ్వడం గులాబీ బాస్ వ్యూహ రచనలో భాగం.. కాంగ్రెస్ సానుభూతి పరులు కూడా పీవీ కుటుంబానికి సానుకూలంగా ఉండే అవకాశం ఉందని కేసీఆర్ ఆలోచన... మరోపక్క ఆశావాహులలో ఎవరిని నిలబెట్టిన టిఆర్ఎస్ ఓడిపోయే అవకాశం ఉండడంతో ..టిఆర్ఎస్ తరుపున మహిళకు టిక్కెట్ ఇవ్వడం తో అంచనాలు మారాయి..కాంగ్రెస్ నుంచి హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ స్థానానికి మాజీ మంత్రి చిన్నారెడ్డి ,బీజేపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ రాంచందర్ రావు ,టిఆర్ఎస్ నుంచి సురభి వాణి దేవి , మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు పోటీ లో ఉండడంతో ఇక్కడ ఛతుర్ముఖ పోటీ నెలకొంది... ఇక్కడ గతం లో ఎన్నడూ గెలవని టిఆర్ఎస్ ఈ సారి ఖచ్చితంగా గెలిచే లా గులాబీ బాస్ వ్యూహ రచన చేస్తున్నాడు..మూడు జిల్లా ల ప్రజాప్రతినిధులతో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు .అంతర్గత విభేదాలను పక్కన పెట్టె సమన్వయం తో అందరు కలసి పనిచేసి ఈ ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుపే లక్ష్యం గా పనిచేయాలని నేతలకు గులాబీ బాస్ టార్గెట్ పెట్టారు. గెలుపే లక్ష్యం గా పనిచేయాలని నేతలకు సూచించారు..వరంగల్ ,ఖమ్మం నల్గొండ ఎన్నిక కూడా గట్టి పోటీ నెలకొంది.. రేపు పల్లా రాజేశ్వర్ రెడ్డి నామినేషన్ ధాఖలు చేయనున్నారు.. కాంగ్రెస్ నుంచి రాములు నాయక్ ,బీజేపీ నుంచి ప్రేమేందర్ రెడ్డి , ప్రొ ప్రొఫెసర్ కోదండరాం ,జయసారథి రెడ్డి ,రాణి రుద్రమ ,తీన్మార్ మల్లన్న బరిలో ఉ ఒడడంతో ఎన్నిక రసవత్తరంగా మారింది.గడిచిన మూడు నెలల నుంచి టిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి విస్తృత ప్రచారం చేస్తున్నప్పటికీ హోరాహోరీ పోటీ తప్పేట్లు లేదు.. ఇప్పటికే కేటీఆర్ ఈ మూడు జిల్లా ల నేతలతో పలు దఫాలుగా సమావేశమ అంతర్గత విభేదాలు తొలగించేందుకు ప్రయత్నించారు.. అయితే సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానం కావడం తో పల్లా రాజేశ్వర్ రెడ్డి ని గెలిపించడం టిఆర్ఎస్ కు బిగ్ టాస్క్ గా మారింది.దుబ్బాక ఓటమి ,జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు దక్కక పోవడం తో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల గెలుపే లక్ష్యం గా టిఆర్ఎస్ వ్యూహాలు రచిస్తుంది...అందుకే సీఎం కేసీఆర్ తో పాటు కెటిఆర్ ఈ ఎన్నికల పై పూర్తి దృష్టి సారించారు..

## సరిహద్దు రాష్ట్రాల్లో పెరుగుతున్న కరోనా కేసులు



హైదరాబాద్,ఫిబ్రవరి 23 ప్రజాపాలన ప్రతినిధి : కరోనాపై తెలంగాణ ప్రభుత్వం మరోసారి అదే తప్పు చేస్తున్నట్లు కనపడుతోంది. ఒకవైపు చుట్టూ ఉన్న రాష్ట్రాల్లో కరోనా విజృంభిస్తుంటే.. సరిహద్దుల్లో అప్రమత్తం చేయకుండా అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. గత ఏడాది కరోనా మొదటిసారి వచ్చినప్పుడు కూడా ఇలాగే అవగాహనా రాహిత్యాన్ని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించి తెలంగాణ ప్రభుత్వం విమర్శలకు గురైంది. వందలాది ప్రాణాలు పోవడానికి కారణమయ్యారంటూ ప్రజలు ప్రభుత్వాన్ని దోషిగా చూశారు. మళ్లీ ఇప్పుడు సయితం ప్రభుత్వం అలాగే వ్యవహరిస్తోంది. మహారాష్ట్ర, కర్నాటక, చత్తీస్‌గఢ్ మూడు రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరిగాయి. ఈ మూడు తెలంగాణ సరిహద్దుల్లో ఉన్నాయి. అయినా సరిహద్దుల్లో వచ్చేవారిని ఆపి పరీక్షలు చేయడం లాంటి చర్యలు చేపట్టడంలేదు. చెక్ పోస్టుల దగ్గర టెస్టులు చేయడంలేదు. అయితే టెస్టుల సంఖ్య పెంచాలని ఆదేశాలు మాత్రం జారీ చేసింది. వీలైనంత త్వరగా వ్యాక్సిన్ అందరికీ అందేలా చూడాలని మంత్రి ఈటెల రాజేందర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు ప్రాక్టికల్‌గా సరిహద్దుల్లో మాత్రం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు.

# యాత్రలకు వేళాయెరా...!



హైదరాబాద్, ఫిబ్రవరి 23 ప్రజాపాలన ప్రతినిధి :తెలంగాణ కాంగ్రెస్‌లో పోటాపోటీ పాదయాత్రలకు నాయకులంతా సిద్ధమయ్యారు. అచ్చంపేట నుండి రేవంత్ పాదయాత్ర ప్రారంభించాక.. పార్టీలో సీనియర్ నాయకులు కూడా యాత్రలు చేస్తామంటూ రెడీ అయ్యారు. నల్గొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి.. తాము పాదయాత్ర చేస్తున్నాం అని ప్రకటించారు. దీంతో తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం కనిపించింది. తీరా గడువు దగ్గర పడేసరికి వాయిదా వేసుకున్నారు. ఊరించి..ఊరించి.. ఎందుకు ఉసూరుమనించారన్న చర్చ ఇప్పుడు పార్టీలో ఆసక్తికర చర్చకు కారణమైంది.మేము సైతం అన్నారు. పాదయాత్రలకు రెడీ అన్నారు. పాదయాత్రలతో సీనియర్ నేతలు కేడర్‌లో ఉత్సాహం నింపేందుకు ప్రయత్నిస్తున్నారని అనుకున్నారు. షెడ్యూలూ ప్రకటించారు. రూట్ మ్యాప్ ఫిక్స్ చేసుకున్నారు..ఇప్పుడు వెనక్కి తగ్గారు నల్గొండ జిల్లా నార్కట్ పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంల కోమటిరెడ్డి సొంత గ్రామం. బ్రాహ్మణవెల్లంల లిఫ్ట్ ఇరిగేషన్ కి 100 కోట్లు కేటాయిస్తే.. ప్రాజెక్టు పనులు పూర్తయ్యేవి. దీనికి తోడు ఎస్ ఎల్ బీసీ టన్నెల్ పనుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ.. బ్రాహ్మణవెల్లంల నుండి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేస్తున్నట్టు ప్రకటించారు కోమటిరెడ్డి. శనివారం నుండే పాదయాత్ర ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. కానీ తీరా ఇప్పుడు వాయిదా వేసుకున్నారు.జిల్లా పోలీసులు 25 మందితో మాత్రమే పాదయాత్ర చేసుకోవచ్చని అనుమతి ఇచ్చారట. కానీ 25 మందితో యాత్ర చేయడం ఏంటి..? అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన యాత్రను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ ఉండటంతో పోలీసులు ఎక్కువమందికి అనుమతి ఇవ్వలేదట. అయితే పర్మిషన్ ఇచ్చిన 25 మందితో యాత్ర చేయలా లేక తాను అనుకున్నట్లు భారీగా యాత్రను కొనసాగించాలా అని ఆలోచించిన కోమటిరెడ్డి.. చివరకు యాత్రను వాయిదా వేయాలనే నిర్ణయించుకున్నారు. మిగతా 2లో..

## రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతోంది: ఎల్. రమణ



హైదరాబాద్, ఫిబ్రవరి 23 ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్రంలో ల్యాండ్, డ్రగ్, శాండ్ మాఫియా రాజ్యమేలుతోందని టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎల్. రమణ ఆరోపించారు. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల స్థానానికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీడీపీ తరపున రమణ నామినేషన్ వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా జరిగే ఎన్నికలు ఇవని ఆయన అన్నారు. తనను గెలిపిస్తే వివిధ వర్గాల సమస్యలను మండలిలో వినిపిస్తానని ఆయన పేర్కొన్నారు. మిగతా 2లో..

## చచ్చిన పాము కాంగ్రెస్.. దాని గురించి ఆలోచించక్కర్లేదు: జగదీష్‌రెడ్డి



నల్లగొండ, ఫిబ్రవరి 23 ప్రజాపాలన ప్రతినిధి : టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. ఏడేళ్ల కాలంలో మోదీ చేసిందేమిటో... తెలంగాణలో కేసీఆర్ చేసిందేమిటో ప్రజలు ఆలోచించాలన్నారు. దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి ప్రజల ఆదాయం తుంచేసింది బీజేపీయేనన్నారు. చచ్చిన పాము కాంగ్రెస్ అని... ఆ పార్టీ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. తాచుపాములా కాటేసేందుకు వస్తున్న బీజేపీ గురించి ఆలోచించాలని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరినీ బీజేపీలోకి స్వాగతిస్తున్నాం: బండి సంజయ్



కాగజ్ నగర్, ఫిబ్రవరి 23 ప్రజాపాలన ప్రతినిధి : దేశాభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరినీ బీజేపీలోకి స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. కాగజ్ నగర్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ పేరు వింటేనే కేసీఆర్‌కు భయం పెరుగుతోందని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో ఈ రాక్షస, గడీల పాలనకు అంతమొందించాలన్నారు. తెలంగాణలో నిద్రలేని జీవులు ఇద్దరున్నారని, వారిలో ఒకరు కేసీఆర్, ఇంకొకరు కేటీఆర్ అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కేటీఆర్ నిద్రలో లేచి సీఎం.. సీఎం అంటున్నాడని ఆయన విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసమే హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం కాబోతోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేస్తామని ఎవరన్నారని ఆయన ప్రశ్నించారు. బీజేపీ ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. ఓడిపోయే ఎమ్మెల్సీ సీటును పీవీ కుటుంబ సభ్యులకు కేసీఆర్ కేటాయించారని ఆయన విమర్శించారు. గెలిచే దమ్ముంటే కేసీఆర్ ఒక చోట, కేటీఆర్ మరో చోట పోటీ చేయాలని ఆయన సవాల్ విసిరారు. ఓడిపోయే సీటిచ్చి పీవీని అవమానించారని ఆయన అన్నారు. రెండు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అడ్వకేట్ దంపతుల హత్యలపై సీబీఐ విచారణ కోరాలన్నారు. టీఆర్ఎస్ విముక్తి కోసం బీజేపీ కార్యకర్తలు ముందుకు రావాలన్నారు. కాగజ్ నగర్ పేపర్ మిల్లులో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కోనప్ప పని ఖతమని ఆయన అన్నారు. 2 బర్రెలతో వచ్చిన వ్యక్తి 200 కోట్లు సంపాదించాడని కోనప్పపై సంజయ్ విరుచుకుపడ్డారు. 30 కోట్ల ప్రాణహిత ప్రాజెక్టును లక్ష కోట్ల ప్రాజెక్టుగా మార్చారని ఆయన విమర్శించారు. ఈ జిల్లాలో ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదన్నారు. గుర్రంపాడు తండాలో గిరిజనులను ఇబ్బందులు పెడుతున్నారని ఆయన అన్నారు. ప్రశ్నించిన బీజేపీ నేతలపై కేసులు పెట్టారని, నాయకులను జైళ్లో పెట్టారని ఆయన పేర్కొన్నారు. ప్రజల కోసం తెగించి కొట్లాడుతామని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను దారి మళ్లించి డ్రామాలు చేస్తున్నారని సంజయ్ ఆరోపించారు.

దేశంలో ఏ సంస్థ కూడా ఇవ్వని అవకాశం మీ కోసం
SNEHA MACS Ltd. Ph : 040-23233989
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED."
Regd. No. TS/DCO/HYD/MACS/2017/314Dt 30th May 2017
SNEHA GROUP OF ORGANISATIONS SNEHA CLUB 20 YEARS CELEBRATIONS
స్నేహ పెన్షన్ స్కీమ్ లో
చేరండి ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
01 జనవరి 2021 నుండి
7 సం॥ల పాటు డిపాజిట్ చేసిన వారికి
డబుల్ ఎమౌంట్ ఇవ్వబడును.
సంవత్సరానికి 11% వడ్డీ ఇవ్వబడును
మీ డిపాజిట్ పై లభించే వడ్డీ
రూ. 1,00,000/- రూ. 11,000/-
రూ. 5,00,000/- రూ. 55,000/-
రూ. 10,00,000/- రూ. 1,10,000/-
*షరతులు వర్తిస్తాయి
మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు
చదువుకు, పెళ్ళి కోసం కానుకగా
మీ డిపాజిట్ 7 సం॥కే రెట్టింపు (Double)
డాక్టర్ కె. శివ భాగ్యారావు IRS, VRS చైర్మెన్
ఎస్. రామకృష్ణ మాక్స్ ప్రెసిడెంట్ 9133312134
రండీ...! త్వర పడండీ...!

# సంత్ గాడ్గే బాబా 145 వ జయంతి వేడుకలు

## అభినవ బుద్ధుడు.. స్వచ్ఛ్ భారత్ పితామహుడు..మహనీయుడు సంత్ గాడ్గే బాబా

మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 23 ,ప్రజా పాలన: సింగరేణి కార్మిక బిడ్డల సంఘం(ఎస్.కె.బి.ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఐబీ విశ్రాంతి భవనంలో అభినవ బుద్ధుడు,స్వచ్ఛ్ భారత్ పితామహుడు, మహనీయుడు సంత్ గాడ్గే బాబా 145వ జయంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా రజక యువజన సంఘం రాష్ట్ర నాయకులు గంగాధారి చంద్రమోహన్, రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోళ్ల నరేష్ లు మాట్లాడుతూ చదువుకునోన్ని కంటే చాకలయన నయమనే తిట్టుని,హేళనని ఒకే కులంలో పుట్టిన వాళ్ళందరిని పుట్టుకలోని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్న బ్రహ్మణీయ సమాజంలో,అదే కులంలో పుట్టి,బహుజనులకు గుడికి బదులుగా,బడుల్లో జ్ఞానాన్ని ,ఆధ్యాత్మిక ఆనందాన్ని చూపించిన వ్యక్తి సంత్ గాడ్గే బాబా అని అన్నారు . అనంతరం స్వేరో సర్కిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీగల శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక అక్షరం ముక్క రాని వ్యక్తి గుడికి చేరువగా రాలేని,దేవుడి విగ్రహం చూడలేని సమాజం దగ్గరికి వెళ్లి అపరిశుభ్రతే అన్ని రోగాలకు కారణమని,ఊళ్ళు వీధులన్నీ ఊడ్చి వాళ్ళ దృష్టిని ఆకర్షించి ఆలోచింపజేసిన వ్యక్తి అని,ప్రజలను మూఢవిశ్వాసాల నుంచి దూరం చేసి,చదువు జ్ఞానం ద్వారానే బహుజనుల జీవితాల్లో మార్పులు వస్తాయని, చదువుకు డబ్బు లేకుంటే ""మీరు తినే రెండు పళ్లాల్లో ఒకటి అమ్మండి, ఒకటే పళ్ళేముంటే దాన్ని కూడా అమ్మి రొట్టెను అరచేతిలో పెట్టుకొని తినండి.పిల్లల్ని మాత్రం బడికి పంపండి,పిల్లల్ని బడికి పంపించడమే పుణ్యం అని,చదువుకు దూరం చెయ్యడమే పాపం అని,ప్రజల దగ్గరి భౌతిక,మానసిక మాలిన్యాన్ని తొలగించి "మీ పరిశుభ్రతే అసలైన దైవం అని,మీ చదువే మీ బతుకుకొక వెలుగు,ఆత్మగౌరవం" అని ప్రకటించిన హేతువాది అని తెలిపారు.మూఢ నమ్మకాలపై యుద్ధం చేసాడని,మద్యపానాన్ని, అంటరానితనాన్ని,బాల్యవివాహాలను నిరసిస్తూ ప్రజలను చైతన్యం చేసి,ప్రకృతిని ప్రేమించ



మన్నాడని,తన జీవిత కాలంలో 60 పైగ ధర్మశాలలు, పాఠశాలలు, పశువుల రక్షణకు కేంద్రాలు ఏర్పాటు చేసాడని,దేశంలోనే తొలి సరిగా కుటుంబాల నిరాదరణకు గురైన వృద్దులకు వృద్ధాశ్రయం కట్టించి,అంటరాని విద్యార్థుల కోసం హాస్టల్స్ కట్టించాడు,బుద్ధుని బోధనలను, సిద్ధాంతాలను పరిచయం చెసిన అభినవ బుద్ధుడని,ఆయున ఆచరణ, జీవనవిధానం నుంచి ప్రస్తుత సమాజం ఎంతో నేర్చుకోవాలి ఉందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇగురపు శ్రీనివాస్, చిట్యాల విక్రమ్, కోప్పర్తి భాస్కర్, కొండ మహేందర్,కుర్మా దినేష్,దేవి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# 20 కోట్ల రిజిస్ట్రేషన్ ఆదాయం

ఖమ్మం, ఫిబ్రవరి 23, :నాలుగు నెలల క్రితం బంద్ అయిన వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు.. గత ఏడాది డిసెంబర్‌లో మళ్లీ మొదలయ్యాయి. రిజిస్ట్రేషన్లు మొదలైన ఈ 60 రోజుల వ్యవధిలో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. 60 రోజుల రిజిస్ట్రేషన్లు ఒక ఎత్తయితే గడిచిన నాలుగు రోజుల్లో జరిగిన రిజిస్ట్రేషన్లు ఒక ఎత్తు. మొత్తంగా 2160 వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు కాగా.. ప్రభుత్వానికి రూ.6 కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో భూముల క్రయ, విక్రయాలు తిరిగి ప్రారంభయ్యాయి. రియల్ వ్యాపారం గాడిలో పడడం, రిజిస్ట్రేషన్లు సైతం జోరుగా కొనసాగడంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం చేకూరింది. వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లను పాత పద్ధతిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేసేందుకు ప్రభుత్వం అదేశించడంతో రూరల్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. గత ఏడాది డిసెంబర్ 14 నుంచి కార్డు (కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) విధానంలో రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. ఎల్‌ఆర్‌ఎస్ నిబంధనలను సైతం ఎత్తివేయడంతో పెండింగ్ ఉన్న ప్లాట్లు, ఇండ్ల రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయి. ప్రభుత్వం వ్యవసాయేతర భూములన్నింటినీ నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశించింది. అయితే రిజిస్ట్రేషన్ల జోరు మొదలుకావడంతో ఆ కార్యాలయమే కేంద్రంగా కొందరు రియల్ వ్యాపారులు తమ అక్రమ రిజిస్ట్రేషన్లను సక్రమం చేసుకునే పనిలో పడ్డారని రియల్ వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రభుత్వ కార్యాలయాన్నే తమ సొంత రియల్ ఎస్టేట్ కార్యాలయంగా మార్చుకున్న ముగ్గురు రియల్ వ్యాపారులు లింకు డాక్యుమెంట్లు లేకుండానే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకుని తమ పనిని పూర్తి చేసుకున్నట్లు ప్రచారం జోరందుకుంది. ఈ వ్యవహారంలో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కీలకంగా పని చేసే ఉద్యోగుల నుంచి, మధ్యవర్తులకు వ్యవహరించే వారి వరకు ఈ రియల్ వ్యాపారులు భారీగా ముట్టచెప్పినట్లుగా ఆరోపణలొస్తున్నాయి. వందల మంది రియల్ వ్యాపారులు ఉండగా ముగ్గురు నలుగురికి చెందిన ప్లాట్లు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుతున్నాయని మిగతా వ్యాపారులు వాపోతున్నారు. లింకు డాక్యుమెంట్లు లేని కొత్త ప్లాట్లకు కూడా రిజిస్ట్రేషన్లు చేసినట్లు సమాచారం.

# రెంటికి చెడ్డరేవడిలా కమల దళం

విజయవాడ, ఫిబ్రవరి 23, :ఏపీలో తెరపైకి వస్తున్న పలు రకాల సమస్యలు రాష్ట్ర బీజేపీని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అటు బడ్జెట్ నుంచి ఇటు స్టీల్ ప్లాంట్ వరకు అందరూ కేంద్రం తీరుపై భగ్గుమంటున్నారు. వాటికి సమాధానం చెప్పలేక.. సర్దిచెప్పుకోవడానికి రాష్ట్ర కమలం నేతలు చేస్తున్న ప్రయత్నాలు విఫలం అవుతున్నాయి. స్టీల్ ప్లాంట్ విషయంలో తమ వద్దకు వచ్చిన ఏపీ నేతల కు ఏం చెప్పారు..నేతల తీరుపై ఢిల్లీ పెద్దలు ఎందుకు మండిపడుతున్నారు అన్న దాని పై ఆసక్తికర విషయాలు వెలుగులోకొస్తున్నాయి.సోము వీర్రాజు రాష్ట్ర అధ్యక్షుడైన తరువాత కొన్ని కార్యక్రమాలతో దూకుడుగా ముందుకు వెళ్లారు. అయితే ఈ క్రమంలో ఆయన అందరినీ కలుపుకు వెళ్లడం లేదనే చర్చ మొదలైంది. తరువాతి కాలంలో కొందరికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం, మరికొందరికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వంటివి పార్టీలో అగ్గిరాజేశాయి. దీంతో రాష్ట్రంలో పార్టీ పోకడలపై ఢిల్లీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్లాయట. రాష్ట్రంలో పలు అంశాల్లో బీజేపీ వ్యవహరిస్తున్న తీరుపై పెద్దలు అసంతృప్తిగా ఉన్నారని సమాచారం. తమకు వచ్చిన ఫీడ్ బ్యాక్, ఫిర్యాదులపై ఆరా తీసినట్టు తెలుస్తోంది.ప్రత్యేక హోదా, పోలవరం నిధులు వంటి సమస్యలు పెండింగ్‌లో ఉండగానే.. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం బీజేపీని మరోసారి ఇరుకునపడేసింది. ప్లాంట్ విషయంలో వచ్చే కష్టాన్ని, నష్టాన్ని ముందే గ్రహించిన పార్టీ నేత మాధవ్ వెంటనే రంగంలోకి దిగి కేంద్ర పెద్దలను కలిశారు. నిర్మాలా సీతారామన్ తో సహా ముఖ్యులను కలిసి స్టీల్ ప్లాంట్ విషయంలో పలు ప్రతిపాదనలు అందజేశారు. అయితే ఇక్కడ ఉద్యమం తీవ్రత పెరగడంతో.. ఏపీ నుంచి ముఖ్యనేతల బృందం అంతా కలిసి ఢిల్లీ ఫ్లైట్ ఎక్కక తప్పలేదు.సోము వీర్రాజు నేతృత్వంలోని మఖ్యనేతలు.. ఉక్కుశాఖ మంత్రితో పాటు పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను కలిశారు. ఆ తరువాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోనూ కొద్దిసేపు మాత్రమే భేటీ కాగలిగారు. అయితే వీరు వెళ్లిన ప్రతిచోటా ఈ బృందానికి తీవ్ర నిరాశే ఎదురైందని సమాచారం. పెట్టుబడుల ఉపసంహరణ విషయంలో కేంద్ర ఒక పాలసీ డెసిషన్ తీసుకుందని..ఇలా ప్రతి అంశానికి అడ్డుచెబితే కుదరదని తేల్చి చెప్పారట. పైగా రాష్ట్ర పార్టీపై వస్తున్న ఫిర్యాదులు, పోకడలపై ఢిల్లీ పెద్దలు కూడా అసహనంతో ఉన్నారట. దీంతో స్టీల్ ప్లాంట్ కోసం ఢిల్లీ వెళ్లిన వారికి పెద్ద క్లాస్ పడినట్లు పార్టీలో చర్చ జరుగుతుంది.అందరూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంవైపే వేలెత్తి చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో దీన్ని కవర్ చేసుకునే పనిలో పడ్డారు రాష్ట్ర బీజేపీ నేతలు. అసలు స్టీల్ ప్లాంట్ అమ్ముతున్నట్లు ఎవరు చెప్పారంటూ ఎదురుదాడి మొదలు పెట్టారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై చిన్న ట్వీట్‌కే ఎందుకింత రచ్చ చేస్తున్నారంటున్న బీజేపీ నేతలు.. మీరెందుకు ఢిల్లీ వెళ్లారు అంటే మాత్రం చాలా అంశాలే ఉన్నాయంటున్నారు. అయితే స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్రం ఏం చెప్పింది అనేది మాత్రం స్పష్టం చెయ్యలేకపోతున్నారు. మొత్తంగా చూసుకుంటే ఢిల్లీ టూర్ అంతా సాఫీగా సాగలేదని ఏపీ బీజేపీ నేతల మధ్య చర్చ జరుగుతోంది.

# పోడు భూముల పోరు గర్జన సభను విజయవంతం చేయండి:సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, గుండాల, ఫిబ్రవరి 23, ప్రజాపాలన: మార్చి 1న భద్రాచలం పట్టణంలో జరిగే పోడు భూముల పోరుగర్జన సభను విజయవంతం చేయాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు, గుండాల ఎంపీపీ ముక్తి సత్యం పిలుపునిచ్చారు. ఈ విషయమై మంగళవారం మండలంలోని కాచనపల్లి గ్రామంలో పోడు భూముల పోరు గర్జన పోస్టర్ ఆవిష్కరణ చ్టేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 ఎన్నికల సందర్భంగా స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివాసులు సాగు చేసుకున్నటువంటి పోడు భూములకు పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చి ఆ హామీని ఇంతవరకు నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. హరితహారం పేరుతో ఆదివాసీలు, ఇతర పేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములలో కందకాలు తీయడం నిలిపివేయాలని, పోడు సాగు చేస్తున్నటువంటి సాగు దారులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మార్చి 1న జరిగే పోడు భూముల పోరు గర్జనకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండాల సర్పంచ్ కొమరం సీతారాములు, నరేష్, ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్)రాష్ట్ర నాయకులు పర్శిక రవి, గడ్డం లాలయ్య, గుండాల ఉపసర్పంచ్ మానాల ఉపేందర్, శేఖర్, కిషన్, చిరంజీవి, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

# గొట్టిముక్కలకు రోడ్డు మంజూరు చేయాలి

## గొట్టిముక్కల ఎంపిటిసి గోపాల్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 23 ( ప్రజాపాలన ) : అను నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు వెళ్తున్న కారణంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమయ్యిందని గొట్టిముక్కల ఎంపిటిసి గోపాల్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గొట్టిముక్కల గ్రామస్థులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి గోపాల్ , గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామాన్ని పట్టించుకునే నాథుడే లేడని, ఏళ్ళు గడుస్తున్నా గ్రామానికి ఉన్న నూతన రోడ్డుకు మోక్షం లేదని తెలిపారు. నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు వెళు తున్నందున దుమ్ము, ధూళి వలన చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యం సమస్యలతో గ్రామస్థులు సతమతం అవుతున్నారని అన్నారు. ప్రభుత్వానికి ప్రపోజల్ పంపినా ఇంకా రోడ్డు వేయించటం లేదన్నారు. పంచాయతీ రాజ్ అధికారులు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి ప్రజల ప్రాణాలు కాపాడాలని తెలిపారు. గొట్టిముక్కల గ్రామం నుంచి అంతారం కోళ్ళ ఫామ్ కు వెళ్ళే దానా వాహనాలు ఆపివేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో పట్లే శ్రీనివాస్, అంజయ్య, సాయన్న, మల్లేష్, కృష్ణయ్య గ్రామస్థులు ఉన్నారు.

# గంగా మాత ఒడిలో ఘనంగా భీష్మ ఏకాదశి ఉత్సవం

## -హాజరైన ఉప్పల్, ముషీరాబాద్ శాసనసభ్యులు





హైదరాబాద్: రామంతపూర్ ప్రజాపాలన ప్రతినిధి: గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మరియు తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర ఐక్య కార్యాచరణ సమితి ఛైర్మన్ దీటి మల్లయ్య అధ్యక్షతన హైదరాబాద్,రామంతపూర్ లోని శ్రీ శ్రీ శ్రీ గంగా లక్ష్మీ భవానీ దేవాలయం లో "భీష్మ ఏకాదశి" పర్వదినం సందర్భంగా భీష్మ పితామహ విశేష పూజలు, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించబడింది.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే శ్రీ బేతి సుభాష్ రెడ్డి, విశిష్ట అతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే శ్రీ ముఠా గోపాల్, గౌరవ అతిథులుగా మాజీ ఎమ్మెల్యే,బి.జె.పి. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్, స్థానిక కార్పొరేటర్ శ్రీమతి శ్రీవాణి వెంకట్ రావు, కార్యాచరణ సమితి వైస్ ఛైర్మన్ కర్మకొండ హనుమంతరావు, కన్వీనర్ కైరంకొండ యాదగిరి,అధికార ప్రతినిధి పాక మధుసూదన్,ఎల్లా ముత్తన్న,కాపర్తి మోహనకృష్ణ,మెట్టు ధన్ రాజ్,భైరు శేఖర్, పాక దేవేందర్, కొలిపాక రామచందర్, పి.సత్యనారాయణ, ఇటికెల సతీష్,వివిధ గంగపుత్ర సంఘాల నాయకులు, మహిళలు, యువకులు, హాజరయ్యారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు పూస సత్తయ్య, కోశాధికారి శ్రీనివాస్ దేవాలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు ఇచ్చి అతిథులను ఘనంగా సత్కరించారు.

# యాత్రలకు వేళాయెరా...!

(మొదటి పేజీ తరువాయి)

కానీ అనుమతి ఇచ్చినంత మందితోనే యాత్రను మొదలుపెడితే బాగుండేదని కాంగ్రెస్ వర్గాలు అనుకుంటున్నాయట.మరో సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి పాదయాత్ర చేయడానికి సిద్ధమయ్యారు. సదాశివపేటలో యాత్ర మొదలుపెట్టి.. గన్ పార్క్ దగ్గర ముగించాలని నిర్ణయించుకున్నారు. కానీ జగ్గారెడ్డి పాదయాత్ర కూడా అనుకున్న షెడ్యూల్ ప్రకారం జరుగలేదు. జగ్గారెడ్డికి యాత్ర చేయాలని ఉన్నా.. ఆయనకు కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాదయాత్ర చేస్తే ఓ రేంజ్ లో ఉండాలి కానీ? నడిచామా అంటే నడించాము అనేలా ఉండొద్దనేది జగ్గారెడ్డి ఆలోచన. అందుకే పాదయాత్రను ప్రస్తుతానికి వాయిదా వేసుకున్నారట. కానీ చెప్పిన సమయానికి పాదయాత్ర చేయకపోవడంతో క్యాడర్ కొంత నారాజ్ అయినట్లు సమాచారం.ఇప్పటికే రెండు సార్లు యాత్ర వాయిదా వేసుకున్నారు జగ్గారెడ్డి. సంగారెడ్డిలో భారీ సభ అనుకున్నారు.. అదీ వాయిదా పడింది. చాలా కాలంగా జగ్గారెడ్డి.. టీఆర్ఎస్ ప్రభుత్వం మీద, తన నియోజకవర్గ సమస్యలపై ఆందోళన బాట పట్టాలని అనుకున్నారు. అయితే కార్యాచరణ ఎప్పుడు, ఎలా అమలు చేస్తారనే దానిపై కొంత క్లారిటీ రావాల్సి ఉంది.

కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జగ్గారెడ్డి ఇద్దరూ కాంగ్రెస్ సీనియర్ నేతలే. ఇద్దరూ మాస్ ఫాలోయింగ్ ఉన్న నాయకులే. కానీ, యాత్రలు అంటూ ప్రకటించి.. ఇప్పుడు వాయిదా వేసుకోవడం కాంగ్రెస్ కేడర్‌ను నిరాశపరుస్తోంది.

ఒకరు చేస్తుంటే ఇంకొకరు రెడీ అంటారు. కానీ తీరా సమయం దగ్గర పడ్డాక? సైలెంట్ అవుతారు..తమ పార్టీ నేతల దగ్గర ఇదే మైనస్ అని నేతలు చర్చించుకుంటున్నారు.

# రాష్ట్రంలో మాఫియా రాజ్యమేలుతోంది: ఎల్. రమణ

(మొదటి పేజీ తరువాయి)

రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా పనిచేశానని రమణ తెలిపారు. తాను 27 ఏళ్ళుగా రాజకీయాల్లో ఉన్నానని ఆయన పేర్కొన్నారు. అందరూ తనకు ఓటు వేయాలని ఆయన కోరారు. టీడీపీ ప్రభుత్వంలోనే మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైద్రాబాద్ జిల్లాలు అభివృద్ధి చెందాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని ఆయన అన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. కోవిడ్ సమయంలో ప్రజలను గాలికి వదిలేసారని ప్రభుత్వాలపై ఆయన విరుచుకుపడ్డారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని రమణ హామీ ఇచ్చారు.

# కమలం గూటికి గ్రేటర్ కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23, :టీ కాంగ్రెస్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయ్. ఇప్పటికే నాయకత్వ సమస్యతో బాధపడుతున్న పార్టీకి మరో సీనియర్ నేత గుడ్‌బై చెప్పారు. ఇంకా బీజేపీలో చేరేందుకు క్యూలో ఉన్నది ఎవరు..గ్రేటర్ లో కాంగ్రెస్ నాయకులు కమలం గూటికి వెళ్ళడానికి క్యూ కట్టారా..తెలంగాణ వ్యాప్తంగా కాషాయ జెండా కప్పుకొక్కువడానికి సిద్ధమైతుంది ఎందరు అన్నదాని పై ఆసక్తికర చర్చ నడుస్తుంది.మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కూన శ్రీశైలం గౌడ్ బీజేపీ కండువా కప్పేసుకున్నారు. పార్టీ పట్ల కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న కూన కాంగ్రెస్ సభ్యత్వానికి పదవులకు రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ ముఖ్య నాయకుల సమక్షంలో కూన శ్రీశైలం కండువా కమలం గూటికి చేరారు.గత ఆరేడేళ్ళుగా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలు బాధకలిగిస్తున్నాయన్నారు కూన.పీసీసీ చీఫ్ రాజీనామా చేసినా కొత్త నాయకుడిని ఎన్నుకోవడంలో ఆలస్యం జరిగే కారణం పార్టీలో ఉన్న అంతర్గత కుమ్ములాటలేనాని చెప్పుకొచ్చారు.కూన శ్రీశైలం గౌడ్ బీజేపీ పార్టీలో చేరిపోయారు. అయితే..ఇప్పుడు ఇంకా ఎంత మంది క్యూలో ఉన్నారనేది చర్చకు దారి తీసింది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులు పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నారని ప్రచారం సాగుతోంది. రమేష్ రాథోడ్,మహేశ్వర్ రెడ్డి తో పాటు..గడిచిన ఎన్నికలల్లో ఎమ్మెల్యే గా పోటీ చేసిన మరో నాయకుడు కూడా కండువా మార్చేయడానికి సిద్ధమయ్యారని టాక్.మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నెరేళ్ల శారదా కూడా చాలా కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీ మీద అసంతృప్తి తో ఉన్నారని సమాచారం. బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ తో ఇప్పటికే భేటీ అయినట్టు తెలుస్తోంది. త్వరలోనే కండువా కప్పుకుంటారని ప్రచారం నడుస్తుంది.ఇప్పటికే హైదరాబాద్‌లో నాయకుల కొరత ఉన్న నేపథ్యంలో..కూన శ్రీశైలం కూడా పార్టీ మారడం తో పార్టీ కి కొంత ఇబ్బందికమైన పరిస్థేనంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయ్.

# తెలంగాణలో బీజేపీ బలపడుతోంది: తరుణ్ చుగ్

పెద్దపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నాయకత్వంలో బీజేపీ పార్టీ తెలంగాణలో రోజురోజుకు బలపడుతోందని ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నేరస్తులకు కొమ్ము కాస్తుందని విమర్శించారు. టీఆర్ఎస్ పాలనలో నేరస్తులు నేరం చేసి స్వేచ్ఛగా సమాజంలో నలుమూలల తిరుగుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీసులు... ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిళ్లకు తలవంచి నేరస్తులను కాపాడుతున్నరని ఆరోపించారు. రాక్షస పాలన నుండి త్వరలోనే తెలంగాణ ప్రజలకు బీజేపీ విముక్తి కలిగిస్తుందని తరుణ్ చుగ్ తెలిపారు.

# హెూప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి

రాయికల్, ఫిబ్రవరి 23(ప్రజాపాలన ప్రతినిధి): హెూప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని రాయికల్ మండలం ఉప్పుమడుగు గ్రామంలో ఉన్న కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల పరిషత్ అధ్యక్షురాలు లావుడ్యా సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్యా పరంగా, నిరుద్యోగ యువతకు వృత్తి శిక్షణ పరంగా,అనాధలకు,అభాగ్యులకు వేము న్నాము అంటూ గత సంవత్సరాలుగా ఎన్నో వెల కట్టలేని సేవా కార్యక్రమాలు నిర్వహించిన హెూప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ కి మరియు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మన మండలంలో ఈ పాఠశాల బాలికల విద్యాభివృద్ధి కోసం డిజిటల్ క్లాస్ ల కొరకై కంప్యూటర్ సిస్టమ్,పవర్ ఇన్వెర్టర్, హై మాస్ లైట్స్ , హాస్టల్ అవసరాల కోసం, వెట్ గ్రైండర్, స్పోర్ట్స్ కీట్స్, ఆడపిల్లలకు ప్రత్యేక కీట్స్ మా చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నందుకు చాల సంతోషంగా ఉందన్నారు. ఇంత మంచి కార్యక్రమం మామండలంలో ఏర్పాటు చేసిన హాప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఫౌండర్ సోదరి హిమజరెడ్డికి వివిధ దాత మహాశయులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు అందరూ చాలా చక్కగా చదువుకొని బంగారు భవిష్యత్తు బాటలు వేసుకోవాలని అందుకు మా వంతుగా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎం.పీ.డీ.ఓ రమేష్, ఎం. ఈ. ఓ గంగాధర్, ఎం.పి.ఓ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ కైరి ముత్తయ్య, కో ఆప్షన్ మొఖిద్, భూపతి పూర్ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్,



ఆశ్రమ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శోభ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు టి.ఆర్.ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వాలీబాల్ క్రీడా సామగ్రిని అందజేషిన వరుణ్ కుమార్



సారంగాపూర్, ఫిబ్రవరి 23 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ మండల్ పెంబట్ల గ్రామానికి చెందిన వాలీబాల్ టీం క్రీడకారులకు నెట్ మరియు వాలిబాల్ క్రీడసామగ్రిని సారంగాపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు జిల్లా దిశ కమిటీ సభ్యుడు ఎండబెట్ల వరుణ్ కుమార్ అందజేశారు. ఒక క్రీడకారుడిగా క్రీడాకారులను ప్రోత్సాహించడం నాబాధ్యత అని ఎండబెట్ల వరుణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శాంతయ్య మండల ఉపాధ్యక్షుడు ముద్దం శ్రీనివాస్ పడిగెల రవి మోదిగం మల్లేష్ తెలు నరేశ్ వంగపెల్లి పవన్ యువత పాల్గోన్నారు.

## ఏ. వై .ఆర్ గ్రౌండ్స్ నందు కోచింగ్ అకాడమీ ఆఫ్ పాఠన్స్ ప్రారంభం





బాలాపూర్ : ప్రజాపాలన : బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్ గూడ లో మంగళవారం నాడు కోచింగ్ అకాడమీ అఫ్ పాఠన్స్( సి. ఎ. పి) క్యాప్ ను ఏ. వై. ఆర్ గ్రౌండ్స్ నందు ఘనంగా భారత క్రికెటర్ యూసుఫ్ పఠాన్, బడంగ్ పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నరసింహరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.... క్రీడా లలో క్రికెట్ ఆట కు చాలా ప్రత్యేకత ఉంది.

అల్మాస్గూడ లో చుట్టుపక్కల ఉన్న చిన్నారులకు కోచింగ్ అకాడమీ ఏర్పర్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి, రామిడి మాధురి వీరకర్ణ రెడ్డి, ఏనుగు రామ్ రెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, ముత్యాల కృష్ణ, జెనిగే ఐలాయ్య, రామిడి నరకర్ణ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రికెట్ అభిమానులు, అకాడమీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అసైన్డ్ భూములు పట్టా భూములుగా గుర్తింపు:వెల్గటూర్ తాసిల్దార్ ఎం.రాజేందర్

వెల్గటూర్, ఫిబ్రవరి 23 (ప్రజాపాలన ప్రతినిధి) : వెల్గటూర్ మండలకేంద్రంలో నివసిస్తున్న ఇంటి భూములు గతంలో ప్రభుత్వ భూములు గా సబ్ రిజిస్టార్ కార్యాలయంలో నమోదు గా ఉన్నవి. గ్రామస్తుల అభ్యర్ధన మేరకు ఇట్టి భూములను సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలతో మరియు ఉన్నతాధికారులతో గతంలో వెల్గటూర్ మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములు గా ఉన్న రికార్డులను సరిచేసి పట్టా భూములు గా గుర్తించినట్లు మండల తహసీల్దార్ ఏం. రాజేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుండీ ఎవరైనా మండల కేంద్రంలోని ఇంటి, చుట్టు పక్కల భూములు కోనేవారు వెల్గటూర్ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోగల సౌకర్యం ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని ఈ అవకాశాన్ని అందరూ నియోగించుకోవాలని తెలియ చేశారు.

## ఎల్. రమణ ఎమ్మెల్సీ నామినేషన్ కు హైదరాబాద్ తరలివెళ్లిన టీడీపీ నాయకులు



జగిత్యాల, ఫిబ్రవరి 23 (ప్రజాపాలన): తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎల్. రమణ హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మంగళవారం రోజున నామినేషన్ వేస్తున్న సందర్భంగా జగిత్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. రాష్ట్ర కార్యదర్శి దయాల మల్లారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి రాజన్న పార్లమెంట్ అధికార ప్రతినిధి వనమాల నిరంజన్ పట్టణ అధ్యక్షుడు కొండ శ్రీధర్ మండల అధ్యక్షుడు పులి మల్లేశం గౌడ్ రాయికల్ మండల్ కార్యదర్శి కునమల్ల రాజం సీనియర్ నాయకులు వొల్లాల గంగాధర్ బోరుగల్ల శంకర్ సోమ నారాయణ రెడ్డి బత్తుల కొండయ్య వేముల శంకర్ పుట్టవర్తిని చక్రపాణి భాస్కర్ మారుతి తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

## మాస్టర్ ప్లాన్ లాండ్ స్కేప్ ఆర్కిటెక్టు తుదిరూపకల్పన:చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ప్రజాపాలన ప్రతినిధి): హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పట్టణంలో పెద్ద చెరువు 6 కోట్లతో మరియు కుమ్మరికుంట 3 కోట్లతో చెరువుల లేక్ ఫ్రంట్ డెవలప్ మెంట్ సంబంధించి మాస్టర్ ప్లాన్ గురించి ప్రముఖ లాండ్ స్కెప్ ఆర్కిటెక్టు ఇంజనీర్ అంజన్ రెడ్డితో చర్చించి తుదిరూపకల్పన చేశారు.

## ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ సభ్యుడు రాజ్ కుమార్ ను అభినందించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, ఫిబ్రవరి 23 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల జిల్లా ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దుమాల రాజ్ కుమార్ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలువగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ రాజ్ కుమార్ ను అభినందించారు. ఎస్సి,ఎస్టీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వారిపై జరుగుతున్న అన్యాయలపై తక్షణం స్పందించి న్యాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు



గట్టు సతీష్ కౌన్సిలర్ బలే లతశంకర్ ముజాహిద్ పట్వారీ వొల్లం మల్లేశం ఏనుగందుల మోహన్ కొత్తూరి గంగారాం దుమాల చంద్రం వారణాసితిరుమలయ్య గంగారాం పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పై మేయర్ జక్క వెంకట్ రెడ్డి అధికారులతో సమావేశం



మేడిపల్లి, ఫిబ్రవరి23 (ప్రజాపాలన ప్రతినిధి) : అభివృద్ధి పనుల పై పీర్జాదిగూడ పట్టణ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్స్ లతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్ లలో ఉన్న సమస్యలు వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల శుభ్రత, త్రాగు నీరు, రోడ్లు,మొదలగు వాటి గురించి వార్డుల వారిగా సమీక్షించారు. వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## మేజిషియన్ పీసీ సర్కార్ జయంతి ఉత్సవాలను ప్రాంభించిన అధికారులు



గొల్లపల్లి, పిబ్రవరి 23 (ప్రజాపాలన ప్రతినిధి):రవీందర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పోలీసు వారి సౌజన్యంతో పి.సి.సర్కార్ పుట్టినరోజు సందర్భంగా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ నుండి గుంజపడుగు, తిరుమలపురం( పీడీ), రంగదాముసిపల్లి, లక్ష్మీపురం, చిల్వకోడూర్, ఎక్స్ రోడ్ నుండి చిల్వకోడూర్ ఊర్లో వరకు పోలీస్ డిపార్ట్మెంట్ కి చెందిన గుర్రం శ్రీనివాస్ కళ్లకు గంతలు కట్టుకొని బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది హీరో ఎక్స్ట్రీమ్ బండి పై శ్రీనివాస్ కూర్చోగా ఎస్ ఐ బలిజేపల్లి జీవన్, బండి స్టార్ట్ చేయగా స్థానిక తాసిల్దార్ నవీన్ ఎం పి డి ఓ జనార్దన్, పూలమాలలు వేయగా జెడ్పిటిసి ఎంపీపీ నక్కశంకర్, జలంధర్, సింగిల్విండో చైర్మన్ రాజసుమన్ రావు, జెండా ఊపి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నిశాంత్ రెడ్డి సంస్థ చైర్మన్ రవీందర్ తో పాటు భోధనపు శ్రీనివాస్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, కనుకుట్ల మహిపాల్ రెడ్డి, చౌటపల్లి తిరుపతి, అంకం భూమయ్య, సజ్జనపు అశోక్, మారంపల్లి బాబు, కచ్చు కొమురయ్య, చెవులమద్ది శ్రీనివాస్, రమేష్ సజ్జనపు జనార్ధన్, నేరెళ్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## పసుర గ్రూప్ అధినేత పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం చేస్తా!





మధిర, ఫిబ్రవరి 23, ప్రజాపాలన : మధిర లోని శ్రీ ఆర్యవైశ్య కళ్యాణ మండపం లోని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు పబ్బతి వెంకట మోహన్ మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు పబ్బతి వెంకట మోహన్ తెలిపారు. ఈరోజు వానవి ట్రస్ట్, మధిర సేవా సమితి ఆధ్వర్యంలో 60 మంది పేదలకు కుట్టు మిషన్లు,గ్రైడర్లు వితరణ చేశారు, ఈ కార్యక్రమం లో పాల్గొన్నవారు. మధిర సేవా సమితి సభ్యులు మాజీ శివాలయం చైర్మన్ కోమటిడి శ్రీనివాస్, మిరియాల కాశి, ఎర్ర లక్ష్మణ్,షేక్ జాంగిర్, బసవరాజు వాసుదేవరావు (అడ్వకేట్)జంగా నర్సిరెడ్డి, ఇరుకుల్ల లక్ష్మీ నరసింహారావు %ఎబతీబజవశ్రీశ్రీఖ% కృష్ణ నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పి పాఠశాలలకు అండర్ టేకింగ్ సర్టిఫికెట్స్ జారి:జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్



జగిత్యాల, ఫిబ్రవరి 23 (ప్రజాపాలన ప్రతినిధి ): జిల్లా ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో నడుపబడుతున్న హై స్కూల్స్ లక్ష్మీదేవిపల్లె, శేఖల్ల, పొలాస, ఓబులపూర్, చెప్యాల పాఠశాలలకు ఇంగ్లీష్ మీడియం బోధన తరగతులకు సంబంధించిన అండర్ టేకింగ్ సర్టిఫికెట్స్ ను జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ జారిచేశారు. వసంతసురేశ్ మాట్లాడుతూ నేటి విద్యార్థులను రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. కరోనా కారణంగా పాఠశాలలో పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శానిటేషన్ చేస్తూ శుభ్రంగా ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ సీఈఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కండ్లపల్లి గ్రామ రైతువేదికలో వ్యవసాయంపై సలహాలు.. సూచనలు

బీరుపూర్, ఫిబ్రవరి 23 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల జిల్లా బీరుపూర్ మండలం కండ్లపల్లి గ్రామంలో రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి అనూష సమావేశం నిర్వహించారు. వరి మొక్కజొన్న నువ్వు తదితర పంటల సాగులో చీడపీడల నుండి రక్షించుకోవడానికి రైతులకు సలహాలు సూచనలు చేశారు. వరిసాగులో సస్యరక్షణ మెలకువలు పురుగు మందులు వాడకం పీచుకారి చేసే పద్ధతులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సర్పంచ్ పర్వతం రమేష్ వ్యవసాయ విస్తరణ అధికారులు సందీప్ శిరీష రైతులు తదితరులు పాల్గొన్నారు.



## న్యాయవాద దంపతుల హత్యకు నిరసనగా విధులు బహిష్కరించిన న్యాయవాదులు



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి23(ప్రజాపాలన) :ఇటీవల హైకోర్టు న్యాయవాద దంపతులైన వామన్ రావు, నాగమణి, లను నడిరోడ్డుపై దారుణంగా హత్య చేసిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు నీకోడే రవీందర్ మాట్లాడుతూ న్యాయవాద దంపతులను హత్య చేయడం హేయమైన చర్య అని, దీనికి నిరసనగా మంగళ, బుధ,వారాలు రెండు రోజులు విధులను బహిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ముక్త సురేష్, చరణ్ తేజ, రాపర్తి రవీందర్, వెంకటేశ్వర్లు, రాజి హైదర్, చంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## స్వతంత్ర అనిమల్ బర్త్ కంట్రోల్ యూనిట్ ను సందర్శించిన మేయర్





బాలాపూర్ : ప్రజాపాలన : బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో వీధి కుక్కల సమస్య రోజు రోజుకి పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అందుకు మంగళవారం నాడు వీధి కుక్కలను వాటి నియంత్రణ లో భాగంగా స్వతంత్ర అనిమల్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఏర్పటు చేసిన అనిమల్ బర్త్ కంట్రోల్ యూనిట్ (%ూతీఱ దీఱతీష్ట్ర జశీఅతీశీశ్రీ% )ను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తో పాటు డిప్యూటీ మేయర్, కార్పొరేషన్ అధికారులు కలిసి సందర్శించడం జరిగింది. ఆమె అక్కడున్న సంస్థ ప్రతినిధి నీ వాటి పోషణ నిబంధనలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిగురుంత పారిజాత నరసింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, కమీషనర్ కృష్ణ మోహన్ రెడ్డి, సంస్థ ప్రతినిధి మహేన్విథ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 24, ఫిబ్రవరి 2021


## షర్మిల పార్టీతో రాష్ట్రానికి మేలు జరిగేనా?

ఇద్దరూ వైయస్ రాజశేఖర రెడ్డి బిడ్డలు. ఇద్దరూ రాజన్న రాజ్యమే లక్ష్యమంటున్నారు. జగన్ ఆంధ్రా ముఖ్యమంత్రిగా రాజన్నరాజ్యాన్ని ప్రజలకు రుచి చూపిస్తున్నారు. షర్మిలమ్మ తెలంగాణలో తానూ రాజన్నరాజ్యం తెస్తానని సిద్ధమవుతున్నారు. వైయస్ రాజశేఖర రెడ్డి మూలాలు గల ఈ ఇద్దరు నేతలు రెండు తెలుగు రాష్ట్రాల్లో విభజన గాయాలు ఇంకా మానని నేపథ్యంలో వేర్వేరుగా సఖ్యతగా రాజకీయాలు నిర్వహించడం సాధ్యమేనా? రేపు తెలంగాణలో షర్మిలమ్మ పార్టీ పెడితే ఆ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ఎంతవరకైనా తెగించవలసి ఉంటుంది. లేకుంటే ఆమెకే కాదు– ఏ పార్టీకైనా ఉనికి ఉండదు. ఇక్కడే అన్నాచెల్లెళ్ల మధ్య రాజకీయ స్పర్థలు మొదలు కానున్నాయి. ఒక వేళ ఇద్దరూ సంయమనం పాటించినా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఇతర పార్టీలు వారిని రెక్కబట్టి ముగ్గులోకి లాగక తప్పవు. షర్మిలమ్మ పార్టీ పెట్టేందుకు సన్నాహాలు మొదలుపెట్టగానే ఒకవైపు బీజేపీ, మరోవైపు కాంగ్రెస్ పార్టీ జగనన్న వదిలిన బాణం కాదని, కేసీఆర్ వదిలిన బాణమని వ్యాఖ్యానాలు చేశారు. షర్మిలమ్మ పార్టీ పెడితే తమకు చెందిన ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోతాయని అంతిమంగా కేసీఆర్ లాభపడతారనే భయాలతో బీజేపీ, కాంగ్రెస్ నేతలు షర్మిలమ్మపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. కేసీఆర్‌కు లాభం చేకూర్చేందుకు జగన్ ప్రోద్బలంతోనే షర్మిలమ్మ పార్టీ పెడుతున్నారని వాదించేవారు కూడా లేకపోలేదు. మరి ముఖ్యమంత్రి జగన్ ఎందుకు బెంబేలెత్తుతున్నారో వీరి నుంచి సమాధానం లేదు. ఏదేమైనా షర్మిలమ్మ పార్టీపై సాగుతున్న చర్చలను గమనిస్తుంటే ఏనుగు, ఏడుగురు గుడ్డివాళ్ల కథ గుర్తుకొస్తోంది. రేపు షర్మిలమ్మ పార్టీ పెడితే తెలంగాణలో ఎన్నికల సందర్భంగా ఎవరెవరికి ఏమేరకు నష్టం జరుగుతుందో ఏమోగానీ, ఈలోపే జగన్, షర్మిలమ్మ ఇరువురూ రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజన్నరాజ్యం ఏర్పాటు చేయబోయి అంతిమంగా వైఎస్ ప్రాభవాన్ని మసకబారేట్టు చేస్తారేమో! ఉమ్మడి రాష్ట్రంలోనూ, నవ్యాంధ్రప్రదేశ్?లోనూ వైఎస్ కీర్తి ప్రతిష్టలు ఏమేరకు ఉన్నాయో పక్కన బెడితే, రాయలసీమ జిల్లాల్లో వైఎస్ ప్రాభవం ఇప్పటికీ బలీయంగా ఉంది. ఆయన సజీవంగా ఉండివుంటే రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ పట్టేదని ఎక్కువమంది భావిస్తున్నారు. ఫలితంగానే మొన్నటి ఎన్నికల్లో వైకాపాకు ఏకపక్షంగా విజయం చేకూర్చారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభజన నాటి సమస్యలు పరిష్కారం కాలేదు. ప్రధానంగా సాగునీటి రంగంలో తెలంగాణతో ఏర్పడిన వివాదంలో రాష్ట్రంలో ఇతర ప్రాంతాల కన్నా రాయలసీమ ఎక్కువ నష్టపోతోంది. తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలతో సీమ ప్రజల చిరకాల వాంఛితమైన సిద్దేశ్వరం అలుగు, గుండ్రేవుల రిజర్వాయర్, పోతురెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. అదే సమయంలో తెలంగాణ నిర్మిస్తున్న పాలమూరు%--%రంగారెడ్డి – దిండి, మరికొన్ని పథకాల పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో షర్మిలమ్మ ఈ అంశంలో ఏపీ వ్యతిరేక వైఖరి తీసుకోకుండా రాజకీయం చేయగలుగుతుందా? ఒకవేళ షర్మిలమ్మ తెలంగాణ ప్రజల ప్రయోజనాల పక్షాన గళం విప్పితే వైఎస్ రాజశేఖర రెడ్డి పరపతి ఏంకాను? రాయలసీమవాసులకు జగన్ ఏమని సమాధానం చెబుతారు? పోలవరం 150 అడుగుల ఎత్తున నిర్మాణం జరిగితే భద్రాచలం మునిగిపోతుందని టీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ, అన్ని పార్టీల నేతలు గోల చేస్తున్నారు. ఈ ఒత్తిడిని షర్మిలమ్మ ఏమేరకు తట్టుకోగలదు? వారితో గొంతు కలిపితే ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రజలకు ఏమని సమాధానం చెబుతారు? ఇవన్నీ శేషప్రశ్నలే. ఒకవేళ వివాదాంశాల్లో షర్మిలమ్మ మౌనం పాటిస్తే– అప్పుడు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలే గాక, అసలుకే మోసం వస్తే సెంటిమెంటు రాజకీయాలతో నెట్టుకువస్తున్న కేసీఆర్ షర్మిలమ్మను ఏపీకి వ్యతిరేకంగా ముగ్గులోకి లాగకుండా ఉంటారా? ఇదే జరిగితే ఏపీలోనూ ప్రతిపక్షాలు ముఖ్యమంత్రి జగన్‌కు పొగబెట్టకుండా ఉంటాయా? ఈ పరిణామాలను వైఎస్ అభిమానులు ఏమేరకు జీర్ణించుకోగలరు? ఇవన్నీ షర్మిలమ్మ బృందం ఆలోచించి ఉండదని భావించలేము. అందుకేనేమో! జగన్ నాకు తోడబుట్టిన అన్న. ఆయన ఆశీస్సులు 'ఉన్నాయనే నమ్ముతున్నాను' అని షర్మిల చెప్పారు. లేకపోతే 'ఉన్నాయని' చెప్పేవారేమో!

# అమ్మకానికి ఆత్మగౌరవం!

బూర్జువాల రాజ్యాంగపు బూజంతా దులపండి, భూతలాన స్వర్గపు నిర్మాతలుగా నిలవండని నాడు శ్రీశ్రీ అన్న మాటలు నేడు ప్రతి ఒక్క ఆంధ్రుడు జ్ఞప్తికి తెచ్చుకుని మరోసారి విప్లవజ్వాలను రగిలించాల్సిన తరుణం ఆసన్నమైంది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కంటూ 32మంది ప్రాణత్యాగాలు, వేలాదిమంది పోరాటం, వేల ఎకరాల భూముల త్యాగం, లక్షలాదిమంది ప్రజల ఆరాటం నేడు విశాఖ ప్రైవేటీకరణతో విలువ లేకుండా పోయింది. నాడు దేనిని సాధించేందుకు ప్రతి ఒక్క ఆంధ్రుడు తపించిపోయాడో నేడు మళ్లీ అదే ఉక్కు కోసం సమరశంఖం పూరించాల్సి రావడం బాధాకరం. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వాజపేయి ప్రభుత్వంపై చంద్రబాబు ఒత్తిడి చేసి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నివారించారు. 1998 మే 3న ఎర్రన్నాయుడు నేతృత్వంలో టీడీపీ ఎంపీలు అప్పటి ఉక్కుశాఖ మంత్రి నవీన్ పట్నాయక్ను కలిసి ఆ పరిశ్రమను నష్టాల నుంచి గట్టెక్కించేందుకు కేంద్రం ఇచ్చిన ఋణాన్ని ఈక్విటీగా మార్చాలని, రుణంపై వడ్డీని మాఫీ చేసి బీఐఎఫ్ఆర్‌కు వెళ్లకుండా తప్పించాలని కోరారు. 1998 ఆగస్టు 11న నవీన్ పట్నాయక్ దీనికి అంగీకరిస్తూ రూ.1333కోట్ల ఋణాన్ని ఈక్విటీగా మార్చారు. విశాఖ స్టీలుప్లాంటు సమగ్రాభివృద్ధికి కన్సల్టెంటును కూడా ఏర్పాటు చేశారు. ఉక్కు కర్మాగారానికి రికార్డు స్థాయిలో లాభాలు వచ్చేలా నాటి టీడీపీ ప్రభుత్వం కృషి చేసిందని 2002లో అప్పటి కేంద్రప్రభుత్వం (మినిస్టరీ ఆఫ్ స్టీల్) స్పష్టంగా పేర్కొంది. ఇప్పుడు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మేస్తుంటే అధికారపక్షం, ముఖ్యమంత్రి ఏమి చేస్తున్నట్టు? ప్రధానమంత్రికి లేఖ రాస్తే ప్రైవేటీకరణ ఆగుతుందా? 25కి 25మంది ఎంపీలనివ్వండి కేంద్రం మెడలు వంచుతానని బీరాలు పలికినవారు నేడు ఎందుకు యూటర్న్ తీసుకున్నారు? అధికారపక్షానికి ఉభయసభల్లో 28 ఎంపీలున్నా ఎందుకు నోరు కుట్టేసుకున్నారు? విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మేయాలనుకోవడమే తప్పుడు నిర్ణయం. పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ వంటి అంశాల్లో బీజేపీ అయోమయాన్ని సృష్టిస్తోంది. పెట్టుబడుల ఉపసంహరణ అంటే 51శాతం ప్రభుత్వం దగ్గర, 49శాతం ఇతరుల దగ్గర ఉంచినా అది ప్రభుత్వరంగ సంస్థనే అవుతుంది. వ్యూహాత్మకంగా 26శాతం ఉంచుకుని మిగతాదంతా ఇచ్చేసినా ప్రభుత్వానికి నియంత్రణ ఉంటుంది. ఇలా ఏదీ కాకుండా 100 శాతం ప్రైవేటీకరణ అంటే ఆమోదించాల్సిన అంశం కాదు. కేంద్రప్రభుత్వమే ఈ కర్మాగారాన్ని లాభసాటి కాకుండా చేసింది. 2015లో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రాకేష్ సింగ్ విశాఖ స్టీలు ప్లాంటుకు గనులు కేటాయించాలని సిఫారసు చేశారు. టీడీపీ ప్రభుత్వం కూడా ఉన్నత స్థాయి అధికారులతో కలిసి, కేజీ బేసిన్ ఆంధ్ర మీదుగా వెళ్తుంది కాబట్టి రాయల్టీ కావాలని, రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్‌కు గనులను కేటాయించాలని కోరింది. విశాఖ స్టీలుకు తప్ప మిగిలిన స్టీల్స్‌కు సొంత గనులు ఉన్నాయి. అందువల్ల ఈ కర్మాగారానికి గనులు, ముడిసరుకు, ఆర్థిక చేయూత కల్పించాలి. ప్రైవేటీకరణ ముసుగులో విశాఖ స్టీలుప్లాంటుకు ఉన్న 22వేల ఎకరాలు కొట్టేయాలన్న కుట్ర కూడా జరుగుతోంది. విశాఖ ఉక్కు కర్మాగారం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ 2018%--%19 నాటికి రూ.95 కోట్ల లాభంతో ఉంది. ఆ నాటికి విశాఖ ఉక్కు మొత్తం ఆస్తుల విలువ (యంత్రాలు, 22వేల ఎకరాల భూములు కలుపుకొని) రూ.35,201కోట్లు. కర్మాగారం పరిధిలో ఉన్న 22వేల ఎకరాల పారిశ్రామిక భూముల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం 2 వేల కోట్లు మాత్రమే. వాస్తవానికి మార్కెట్ లెక్కల ప్రకారం ఒక ఎకరా రూ.10కోట్లు పైనే ఉంటుంది. అంటే విశాఖ ఉక్కుకి చెందిన భూములు మాత్రమే రూ.2లక్షల కోట్లు పైన విలువ చేస్తాయి. 2018%--%19 నాటికి 17,574 మంది కంపెనీలో శాశ్వత ఉద్యోగులుగా పని చేస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిన సుమారు 25వేల మంది పని చేస్తున్నారు. అంటే, ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 45వేల మందికి పైనే ఉద్యోగాలు కల్పించింది. విశాఖ ఉక్కు కర్మాగారం ఇనుప ఖనిజాన్ని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీ మొత్తంలో కొనుగోలు చేస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ మొత్తంలో తీసుకొంటోంది. అయితే ఉమ్మడి రాష్ట్రంలో ముడి ఇనుప ఖనిజం ఉన్న ఓబులాపురం, బయ్యారంలో గనులు 2005 నుంచి అందుబాటులోకి వచ్చాయి. కానీ అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి బయ్యారం గనులను తన అల్లుడు బ్రదర్ అనిల్‌కు, ఓబులాపురం గనులను గాలి జనార్దన్ రెడ్డికి అప్పజెప్పారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు పోస్కో, జిందాల్, టాటా వంటి కంపెనీలకు గనులు కేటాయించడం వల్ల విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి గనుల కొరత ఏర్పడింది. అప్పటి నుంచి పోస్కో, జిందాల్, టాటా వంటి వాటి దగ్గర ముడి ఇనుమును ఎక్కువ ధరకు కొనుగోలు చేసి ఉత్పత్తి చేయటం వల్ల విశాఖ కర్మాగారానికి ఉత్పత్తి వ్యయం పెరిగింది. గత రెండేళ్ళ నుంచి పోస్కో ఈ కర్మాగారానికి ముడి సరకు అందకుండా పక్కా ప్రణాళికతో నష్టాల బాట పట్టించింది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే 2019 జూన్‌లో పోస్కో ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి ఈ కర్మాగారాన్ని దక్కించుకోవటానికి సహకరించాలని కోరారు. ఆ తరువాత నవంబర్ 2019న కేంద్ర ఉక్కుమంత్రి సైతం పెట్టుబడి పేరుతో ముఖ్యమంత్రితో తాడేపల్లిలోని ఇంటిలో భేటీ అయ్యారు. అక్టోబర్ 29, 2020న పోస్కో ప్రతినిధులను ముఖ్యమంత్రి మళ్లీ కలిశారు. ఆ కలయికల ఆంతర్యం ఏమిటో అప్పుడు ప్రజలకు అర్థం కాలేదు. కాని కేంద్రప్రభుత్వం విశాఖను ప్రైవేటీకరణ చేస్తున్నామని ప్రకటన వెలువరించిన వెంటనే నాటి భేటీలు ఎందుకో ఇప్పుడు అర్థమవుతున్నాయి. వాస్తవానికి ఒడిశాలో పోస్కో గనులు ఉన్న ప్రాంతంలో భూములు కేంద్రంలో చక్రం తిప్పే ఒక ప్రముఖ నాయకుడివే. అందుకే వైజాగ్ స్టీలును పోస్కోకు అప్పగించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పోస్కో చేతికి విశాఖ ఉక్కు ప్లాంటు చిక్కితే ఒడిశాలో ఉన్న గనుల నుంచి ముడి ఇనుము తెచ్చి ఇక్కడ పనులు ప్రారంభించి అంతర్జాతీయ మార్కెట్టులో లాభాలు ఆర్జిస్తుంది. వైజాగ్ స్టీలుప్లాంటు పరిస్థితి ఇలా ఉంటే ఇక కడప స్టీలు ప్లాంటు పరిస్థితి ఏమిటి? అదంతా ఉత్త డ్రామానేనా? ప్రతిపక్షాలు, ఉక్కు కార్మికులు, ఉద్యోగ సంఘాలు ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తారు. కాబట్టి వాళ్ళ మధ్య గొడవలు పెట్టి గ్రూపులుగా విడగొట్టాల్సిన బాధ్యత అధికారపక్షం మీద పడింది. ఎటూ రాష్ట్రంలో అధికారంలో ఉన్నారు కాబట్టి అందరినీ కట్టడి చేసేందుకు పోలీస్ బలగాలను ఉపయోగించనున్నారు. ఎక్కువ కాలం ధర్నాలు, దీక్షలు లేకుండా చేసి వాళ్ళను, మళ్ళీ ఇదే ప్రైవేట్ కంపెనీలో తమకు ఉద్యోగాలుంటే చాలు అనే స్థితికి వాళ్లను తీసుకువచ్చే కుట్రలకు తెరలేపుతున్నారు. ఏది ఏమైనా విశాఖ ఉక్కు %--% ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని మళ్లీ ఎలుగెత్తి గర్జించాల్సిన తరుణం ఆసన్నమైంది. ఆ కర్మాగారం అనేది ఒక్క ఉత్తరాంధ్ర ప్రాంతానికే చెందింది కాదు, యావత్ తెలుగు ప్రజలందరికీ చెందినది. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన నాయకులు దళారులుగా మారి మనకు ఉరితాళ్లు బిగించి, స్టీలుప్లాంటును పరాయి పంచన చేర్చాలనే దుష్ట సంప్రదాయానికి పూనుకోవడం జాతిద్రోహమే! ఆంధ్రులకు గర్వకారణంగా ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మకానికి పెట్టడమంటే మన ఆత్మాభిమానాన్ని అమ్ముకున్నట్లే. జాతి సంపదకు సంరక్షకుడిగా ఉంటానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి నేడు జాతి సంపద దోపిడీ అవుతున్నా మిన్నకుండిపోవడం సమంజసం కాదు. పాలకులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా నిలువరించగలిగే సామర్థ్యం ప్రజలందరికీ దక్కినప్పుడే స్వరాజ్యం వచ్చినట్లు. నేడు ఏపీలో స్వరాజ్య స్థాపనకు ప్రజలు నడుం బిగించాలి. మన రాష్ట్రాన్ని మనవే కాపాడుకోవాలి.




Sandhya Alipta's కవితలు శీర్షికలో ఇక పై అన్ని కవితల ప్రచురణ కొనసాగుతుంది.

"మనసు దాచిన పదాలు" శ్రీర్షికకు అందిన కవితలకు కాంప్లిమెంట్స్ పంపబడును. మీ పూర్తి చిరునామా sandhya.n.ipr @gmail.com కు పంపవలెను.


# 'విద్యుత్' వైపరీత్యమే చమోలీ విపత్తు



విశాల భారత భూఖండం కింద ఒక బృహత్ టెక్టానిక్ ప్లేట్ (విరూపకారక ఫలకం– భూపటలంలోని శిలాపదార్థం విచ్ఛిన్నమవడం, వంపులు తిరగడాన్ని విరూపకారక ప్రక్రియ అంటారు) ఉంది. 'ఇండియన్ ప్లేట్'గా ఇది సుప్రసిద్ధం. భూ భ్రమణం కారణంగా ఈ ప్లేట్, అంటే, పెద్ద భూభాగం నిరంతరం ఉత్తర దిశగా చలిస్తుంటుంది. ఒక సెంట్రీఫ్యూగల్ మెషీన్ (అపకేంద్రక యంత్రం)లో ఏ పదార్థమైనా పై స్థాయికి చేరే విధంగా భారత్ భూఫలకం నిరంతరం ఉత్తర దిశగా కదులుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అలా కదులుతూ ఇది టిబెటన్ ప్లేట్‌ను ఢీకొంటుంది. ఈ రెండు బృహత్ భూఫలకాల మధ్య ఒత్తిడి హిమాలయాల నిరంతర ఊర్ధ్వ చలనానికి దారితీస్తుంది. అంతేకాదు, భూకంపాలకు, మరీ ముఖ్యంగా ఉత్తరాఖండ్‌లో భూప్రళయాలకు దారితీస్తోంది. ఫలితంగా ఉత్తరాఖండ్‌లో ప్రతి పది సంవత్సరాలకు కనీసం ఒకసారి పెను భూకంపం సంభవిస్తుంది. అయితే గత ఇరవై సంవత్సరాలుగా తీవ్ర భూకంపాలు ఏవీ సంభవించలేదు. కారణమేమిటి? బహుశా తెహ్రీ జలాశయంలో అపారంగా నిల్వ ఉన్న నీరు భారత, టిబెటన్ బృహత్ భూఫలకాల మధ్య ఒత్తిడిని నిభాయించడమే కావచ్చు. అయినప్పటికీ భారత భూఫలకం టిబెటన్ భూ ఫలకాన్ని ఢీ కొనటం కొనసాగుతూనే ఉంది. పర్యవసానంగా రాబోయేకాలంలో మరింత భయానకమైన భూకంపం సంభవించే అవకాశం ఎంతైనా ఉంది. టెక్టానిక్స్ (భూపటలంలోని చలనాలకు కారణమయ్యే అంతర్జనిత ప్రక్రియలు) మూలంగా భూపాతాలు సంభవిస్తుంటాయి. ఈ ఘటనల్లో వివిధ భౌతిక పదార్థాలు పెద్ద ఎత్తున నది గర్భంలో నిక్షిప్తమవుతాయి. కాల క్రమంలో గంగా ప్రవాహం వాటిని మైదానాలకు తీసుకువెళుతుంది. ఇదొక ప్రాకృతిక చర్య. నిరంతరంగా కొనసాగవలసిన చర్య. ఇందు కోసం గంగాప్రవాహం స్వేచ్ఛగా సాగి పోతుండడం అవశ్యం. జల విద్యుదుత్పాదనకు నదులపై నిర్మిస్తున్న బ్యారేజీలు, డ్యాంలు నదిలో స్వేచ్ఛా ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. 2013 కేదార్‌నాథ్‌లో సంభవించిన విలయంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పర్యావరణ మంత్రిత్వశాఖ ఒక కమిటీని నియమించింది. 2013 విపత్తులో సంభవించిన పెనునష్టం అంతా జల విద్యుదుత్పాదన ప్రాజెక్టులకు ఎగువున లేదా దిగువున సంభవించిందని ఆ కమిటీ నివేదిక పేర్కొంది. అసాధారణ స్థాయిలో కుండపోత వర్షాలు కురవడం దీనికి కారణం కాదని నిర్మాణమైన, నిర్మాణంలో ఉన్న పలు విద్యుదుత్పాదన ప్రాజెక్టుల వల్ల మందాకిని, అలకనంద నదులలో స్వేచ్ఛా ప్రవాహానికి అంతరాయం కలగడమే వల్లే కేదార్‌నాథ్‌లో మహా విపత్తుకు కారణమని ఆ కమిటీ స్పష్టం చేసింది. ఇది సంపూర్ణ సత్యం. రిషిగంగ, ధౌలిగంగా నదులలో స్వేచ్ఛాప్రవాహానికి రిషి గంగ, తపోవన్ విష్ణుగాడ్ విద్యుదుత్పాదన ప్రాజెక్టులు అవరోధంగా పరిణమించినందునే ఇటీవల చమోలీలో భయానకస్థాయిలో మంచు చరియలు విరిగిపడి జలప్రళయం సంభవించింది. ప్రస్తావిత రెండు విద్యుదుత్పాదన ప్రాజెక్టులూ ఆర్థికంగా లాభసాటి కాదని నిపుణులు హెచ్చరించినప్పటికీ ఉత్తరాఖండ్ ప్రభుత్వం వాటి నిర్మాణాన్ని చేపట్టింది! సరికొత్త విద్యుత్ ప్రాజెక్టులు ఉత్పత్తి చేసే విద్యుత్ ధర ప్రస్తుతం యూనిట్‌కు 7 నుంచి 10 రూపాయల వరకు ఉంది. సరే, పర్యావరణ పరమైన వ్యయాలు తక్కువేమీ కావు కదా. అయితే వీటిని విద్యుత్ ధర నిర్ణయంలో పరిగణనలోకి తీసుకోరు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు ప్రతిపాదిత కోట్లిభెల్–1బి ప్రాజెక్ట్ ఉత్పత్తిచేసే విద్యుత్ ధర యూనిట్‌కు రూ.18గా ఉంటుంది. మరి సౌర విద్యుత్ యూనిట్ కేవలం రూ.3కే లభిస్తుంది. దీనితో ఒక సమస్యేమిటంటే సౌరశక్తి పగటిపూట మాత్రమే ఉత్పత్తి అవుతుంది. ఉదయం, ఆ తరువాత సాయంత్రం మాత్రమే విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండే సమయాలు. సూర్యుడు నడినెత్తిన ఉన్నప్పుడు ఉత్పత్తి అయ్యే సౌరవిద్యుత్‌ను యూనిట్‌కు యాభైపైసల అదనపురుసుముతో సరఫరా చేయడం ద్వారా ఉదయం, సాయంత్రం అవసరాలకు వినియోగించుకోవచ్చు. అంటే సౌర విద్యుత్ యూనిట్ రూ. 4 కంటే తక్కువ ధరకే లభ్యమవుతుంది. అయినప్పటికీ ఉత్తరాఖండ్ ప్రభుత్వం జల విద్యుదుత్పాదన ప్రాజెక్టులను విచక్షణారహితంగా నిర్మిస్తోంది! విద్యుదుత్పాదన ప్రాజెక్టులకు బదులుగా గంగానదీ తీరప్రాంతాలలో సాఫ్ట్‌వేర్ పార్కులు, విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు, కంప్యూటర్ సెంటర్‌ల ఏర్పాటుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం పూనుకోవాలి. తద్వారా గంగా జలాల మహిమాన్విత మానసిక, ఆధ్యాత్మిక శక్తిని ఉపయోగించుకోవడం, సంపూర్ణంగా వినియోగించుకోవడం సాధ్యమవుతుంది. విద్యుదుత్పాదన ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిలిపివేయడం హిమాలయాలలోని పర్యావరణంపై పడుతున్న భారాన్ని తగ్గించడానికి తోడ్పడుతుంది. ఉత్తరాఖండ్ యువజనులకు నర్సులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, ప్రోగ్రామర్లుగా ఉద్యోగాలు లభించి జీవితోన్నతిని సాధించగలుగుతారు. ప్రస్తుతం వారు తక్కువ వేతనాలు వచ్చే ఉద్యోగాలతో సంతృప్తి పడవలసివస్తోంది. ప్రాజెక్టుల నిర్మాణం జరిగే పది సంవత్సరాల పాటు మాత్రమే వారికి ఆ ఉద్యోగ వసతి ఉంటుంది. సేవల రంగాన్ని ప్రోత్సహించడం కంటే జల విద్యుదుత్పాదన ప్రాజెక్టుల నిర్మాణానికే ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం సబబుగా లేదని చెప్పక తప్పదు. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇలా వ్యవహరించడానికి కారణమేమిటి? విద్యుదుత్పాదన ప్రాజెక్టులకు పర్యావరణ, అటవీశాఖల అనుమతులు తప్పనిసరిబీ భూ సేకరణ విషయం గురించి చెప్పనవసరం లేదు. ఈ కార్యకలాపాలలో ప్రభుత్వాధికారులకు కీలకపాత్ర ఉంటుంది. సేవలరంగాన్ని అభివృద్ధిపరచడంలో ప్రభుత్వ ఉపేక్షకు ప్రధాన కారణం సాఫ్ట్‌వేర్ కంపెనీల అధిపతులు విద్యుదుత్పాదన ప్రాజెక్టుల కాంట్రాక్టర్ల వలే అధికారవర్గాలకు తలొగ్గరు. ఇది అధికారులకు, వారి రాజకీయ యజమానులకు సుతరామూ ఇష్టం లేదు. ప్రపంచ, పర్యావరణ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని నదులకు హాని చేస్తూ ప్రాకృతిక ఉత్పాతాలకు కారణమవుతున్న జల విద్యుదుత్పాదన ప్రాజెక్టుల నిర్మాణానికి ఉత్తరాఖండ్ ప్రభుత్వం తక్షణమే స్వస్తి చెప్పాలి.

# శీతలమైన అతిపురాతన దేవాలయం

## మంగేల గ్రామంలో మరుగునపడ్డ ఆలయం
## విశిష్టత కల్గిన విమాన గోపురంతో వర్ధిల్లిన కట్టడాలు
## దేవాలయానికి పూర్వవైభవం తేవాలని గ్రామస్తుల ఆరాటం



బీరుపూర్, ఫిబ్రవరి 23 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల జిల్లా బీరుపూర్ మండలం మంగేల గ్రామంలోని గోదావరి సమీపాన గ్రామ ఊర చేరువు కట్టప్రక్కన ఎత్తయిన గట్టుమీద అతి పురాతన దేవాలయం శీతిలమైంది.... వివరాల్లోకి వెళ్ళితే గ్రామ సర్పంచు సుంచు శారదనరేందర్ ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ భలుమురి లక్ష్మణ్ రావు గ్రామానికి చెందిన పెద్దలు వివిధ పార్టీల నాయకులు సోమవారం రోజున పురాతన శీతిలమైన ఆలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ దేవాలయానికి ఒక విశిష్ట స్థానం ఉన్నదని సుమారు 9వ శతాబ్దం నుండి 11వ శతాబ్దం వరకు ఆలయ వైభవం కోనసాగవచ్చని గ్రామస్తుల అంచనా... ప్రధానంగా ఆలయ చిత్రాలను బట్టిచూస్తే కట్టడాలు శిల్పాలు స్తంభాలు ఎర్రటి ఇసుక రాళ్లతో పొదిగిన రాళ్లు విమాన ఆకారంతో కనబడుతున్నాయి. ఉసిరికాయ ఆకారంలో ఉన్న శిల్పాలు నేలమీద పడి ఉండడంతో అందరిని ఆకర్షించి మగ్ధుల్ని చేస్తున్నాయి. గర్బగుడి పైకప్పులో శిల్పకళలు చేతులలో ఢమరుఖం త్రిశూలం సర్పం గధదండం ఉన్న శిల్పాలు మనకు కళ్ళకు అద్దినట్టు కనబడుతున్నాయి...

ముఖ్యంగా గుప్తనిధుల ముఠాలు గర్భగుడి లోపల వెలుపల తవ్వకాలతో విగ్రహాలు లేకుండ మాయం చేశారని గ్రామస్తులు ఆరోపనలు వ్యక్తం చేస్తున్నారు... గ్రామస్తుల ఆలోచన ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పురాతన చరిత్ర కలిగిన శీతిలవస్థమైన ఆలయాన్ని నిర్మించి తీరాలని మరియు జగిత్యాల స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రత్యేక చోరవ తీసుకోని నిధులు కేటాయించి ఆలయానికి పూర్వవైభవం తేవాలని కోరుతున్నారు. ముఖ్యంగా ధాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి కృతజ్ఞులు కావాలని గ్రామ సర్పంచ్ సుంచు శారదనరేందర్ గ్రామస్తులు కోరుతున్నారు.

## బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని
## మధిర ఎమ్మార్వోకి వినతి పత్రం ఇచ్చిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి కంభం శివకృష్ణ



మధిర, ఫిబ్రవరి 23, ప్రజాపాలన :మధిర తాసిల్దార్ కలిసి వినతిపత్రం ఇచ్చారుఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీలకు జనాభా ప్రాతి పదికన రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్రంలో బిసి జనాభా 56 శాతం ఉంటే పార్లమెంటులో,అసెంబ్లీలో బీసీ కులాలకు ప్రాతినిధ్యం ఉండట్లేదని చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పెట్టాలని బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లో రిజర్వేషన్ కల్పించాలని విద్యా ఉద్యోగ శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీలకు క్రిమినల్ ఎత్తివేయాలని జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య గారి పిలుపులో భాగంగా మధిర ఎమ్మార్వో గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గోగుల నాగేశ్వరరావు,రచ్చ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా రాములు నాయక్ ను గెలిపించాలి



వలిగొండ ప్రజాపాలన ; ప్రస్తుతం జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాములు నాయక్ ను గెలిపించాలని ఎంపిపి నూతి రమేష్ రాజు అన్నారు. మంగళవారం మండలంలోని గోకారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి రాములు నాయక్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని,రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలు ఎండగట్టడానికి రాములు నాయక్ ను గెలిపించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శనిగారపు పాండు,కట్ట లింగస్వామి,యాదయ్య, శ్రీకాంత్,పాండు,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పులు తెచ్చి గ్రామ అభివృద్ధికి వినియోగించాం
### బిల్లులు త్వరగా ఇప్పించండని ఆగ్రహం వ్యక్తం చేసిన సర్పంచులు
### బిల్లులు వచ్చే వరకు తదుపరి అభివృద్ధి పనులు చేపట్టం




వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 23 ( ప్రజాపాలన ) : పల్లె ప్రగతే లక్ష్యంగా అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టినా ఇంత వరకు బిల్లులు రాలేవని వికారాబాద్ మండల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వికారాబాద్ మండల కేంద్రములోని రవీంద్ర మండపంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి కామిడి చంద్రకళ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కామిడి చంద్రకళ మాట్లాడుతూ వికారాబాద్ మండల అభివృద్ధి కోనం అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో పని చేయాలన్నారు. మండలంలో నెలకొని ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని తెలిపారు. పలువురు అధికారులు సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొట్టడం సరికాదని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సర్వసభ్య సమావేశానికి వచ్చిన సమస్యలు మళ్ళీ రాకూడదని తెలిపారు. గొట్టిముక్కల ఎంపీటీసీ గోపాల్ మాట్లాడుతూ గొట్టిముక్కల గ్రామంలో అభివృద్ధి శూన్యంగా ఉందని, ఇప్పటి వరకు మిషన్ భగీరథ నీరు ఒక ఇంటికి కూడా అందటం లేదన్నారు. గ్రామంలో చాలా కాలంగా రోడ్డు పూర్తిగా పాడై పోయిందని, దానికి ప్రభుత్వానికి నివేదికలు అధికారులు పంపాలన్నారు. అలాగే పుల్ మద్ది గ్రామంలో విద్యుత్ సమస్యలు ఉన్నాయని దానిని బాగు చేయించాలని సర్పంచ్ తిమ్మాపురం మాధవరెడ్డి తెలిపారు. మదన్ పల్లి గ్రామంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కో ఆప్షన్ సభ్యుడు జాఫర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సుభాషిణి, వైస్ ఎంపీపీ కొండి రాములు,సర్పంచ్ లు,కార్యదర్శి లు ఉన్నారు.

## 6,7 ,8 తరగతులు ప్రారంభం



బాలాపూర్ : ప్రజాపాలన : తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి 6, 7, 8, తరగతులను వివిధ పాఠశాలల్లో ప్రారంభించుకోవచ్చని తెలిపారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ మంత్రి వెల్లడించారు. కోవిడ్ 19 ప్రత్యేక మార్గదర్శకాలు పాటిస్తూ రేపటి నుంచి మార్చి ఒకటో తేదీ లోపు ఎప్పుడైనా తరగతులు ప్రారంభించుకోవచ్చు అని పాఠశాలలకు సూచించారు. అదేవిధంగా పాఠశాలలకు వచ్చే ప్రతి విద్యార్థులు తల్లిదండ్రుల అనుమతి పత్రం తప్పనిసరిగా తీసుకురావాలని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

## తోటి మిత్రులు ఆర్థిక సహాయం అందజేత



వలిగొండ ప్రజా పాలన ప్రతినిధి: మండల కేంద్రానికి చెందిన లక్ష్మీపతి లాక్డౌన్ సమయంలో మృతి చెందడంతో మృతునితో చదువుకున్న బ్యాచ్ తోటి మిత్రుల సౌజన్యంతో 47 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. మృతుని కూతురు పైచదువులకు భవిష్యత్తులో సహాయం అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలకుంట్ల శ్రీనివాస్,మైసోళ్ల మత్స్యగిరి,యార శ్రీశైలం,పబ్బు స్వామి,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన నల్లమాస కిష్టయ్య ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందడంతో మంగళవారం వారి కుటుంబ సభ్యులను భువనగిరి మాజీ పార్లమెంటు సభ్యులు డా బూర నర్సయ్య గౌడ్ పరమార్శించి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దేగల పాండు యాదవ్,మండల రైతు కో-ఆర్డినేటర్ మమతా నరేందర్ రెడ్డి,ఎంపిటిసి నోముల మల్లేష్ యాదవ్,నరేష్,జువ్వగాని సుమన్ గౌడ్,శ్రీను,ధనుంజయ్,అశ్విన్,సత్యనారాయణ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో కొనసాగుతున్న టిఆర్ఎస్ సభ్యత్వ నమోదు



వలిగొండ ప్రజా పాలన ప్రతినిధి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు టిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలంలోని సంగెం,అక్కంపల్లి,వలిగొండ, గోకారం, దుప్పల్లి,వేములకొండ గ్రామాలలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు సభ్యత్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అయిటిపాముల సత్యనారాయణ,ఎడవెల్లి శాంతికుమార్,ఎమ్మె లింగస్వామి,ఆకుల వెంకన్న,బొడ బాలయ్య,సాయిని నాగేష్, వరికుప్పల మల్లేష్,బాలయ్య,మంద నర్సింహ,గుడిసె నర్సింహ,ఎర్ర శ్రీకాంత్,నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న:కోమటి డి



మధిర, ఫిబ్రవరి 23, ప్రజాపాలన : కోమటిడీ శ్రీనివాస రావు శివాలయం మాజీ చైర్మన్ గారి సతీమణి కోమటిడీ జ్యోతికృష్ణ గారి పుట్టినరోజు సందర్భంగా డాక్టర్ వసంతమ్మగారి మానసిక దివ్యాంగుల సేవా సదనం ప్రత్యేక పాఠశాల వసతి గృహము నందు అన్న వితరణ చేసినారు ఈ కార్యక్రమం లో మధిర శివాలయం మాజీ చైర్మన్ కోమటిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ మనసీక దివ్యాంగులకు అన్నదానం చెయ్యటం కాకుండా వారితో కలిసి భోజనం చెయ్యటం చాలా సంతోషంగా అనిపిస్తుంది దీనిని నిర్వహిస్తున్న కీర్తి శిష్యులు డాక్టర్ వసంతమ్మగారి కుమార్తె డాక్టర్ శీల గారిని ప్రత్యేక అభినందనలు తెలిపారు అలాగనే కీర్తిశేషులు కోమటిరెడ్డి రంగారావు గారి జ్ఞాపకార్థం సంవత్సరం కాలం నుండి ప్రతి నెల ఏడవ తారీకు అన్న వితరణ నిర్వహిస్తున్నాం అలాగే మా కుటుంబ సభ్యులు పుట్టినరోజు లు కానీ పెళ్లి రోజులు కానీ మానసిక వికలాంగులకు అన్నదానం నిర్వహించడం చాలా సంతోషంగా అనిపిస్తుంది వీరి సేవ చేయడం నా వంతు సేవ చేయడం చాలా సంతోషం మనీ కోమటిరెడ్డి శ్రీనివాస్ రావు తెలిపారు ఈ అన్నదానం ఈ కార్యక్రమంలో కోమటి సాయి భరత్ ,కోమటిడి జ్యోతిలక్ష్మి, కోమటి సాయికిరణ్ పాల్గొన్నారు.

## నాదర్గుల్ గ్రామంలో మత్స్య కార్ల నూతన కమిటీ



బాలాపూర్ : ప్రజాపాలన : నాదర్గుల్ గ్రామంలో మత్స్య శాఖ సహకార సంఘం లో నూతన కమిటీ నిర్వహించారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్గుల్ గ్రామంలో మంగళవారం నాడు మత్స్య శాఖ సహకార సంఘం లో ఎన్నికల్లో భాగంగా ఎన్నికల అధికారి ఎ. డి రమేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మత్స్య సహకార సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. నాదర్గుల్ మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షులు బోయిని స్వామి ముదిరాజ్, ఉపాధ్యక్షులు తిరుపతి లింగమయ్య ముద్రాజ్, కార్యదర్శి తిరుపతి బాబయ్య ముద్రాజ్, తో పాటు సంఘం సభ్యులు బొద్ర మో ని శ్రీరాములు ముద్రాజ్, మోత కానీ శ్రీధర్ ముదిరాజ్, తిరుపతి విద్యాపతి ముదిరాజ్, బోయిని జగన్ ముదిరాజ్, మంత్రి మహేష్ ముదిరాజ్, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రాంబాబు ని వెంటనే సస్పెండ్ చేయాలి:ఎమ్మార్పీఎస్

అశ్వరావుపేట ప్రజా పాలన : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం లో నందిపాడు గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ పదం నాగమణి కోవిడవ్యాక్సిన్ వికటించి మృతి చెందిందని దీనికి బాధ్యులు అయినటువంటి డాక్టర్ రాంబాబు ని వెంటనే సస్పెండ్ చేయాలని, అశ్వరావుపేట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వినాయకపురం గవర్నమెంట్ హాస్పిటల్ ముందు ఈ రోజు నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. నాగమణి మృతి చెందితే ఆమెకు షుగర్ బి.పి ఉందని తప్పుడు ఆరోపణలు చూపించారని వారు ఆరోపించారు. ఇలా ఇంకా ఎవరికీ జరగకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని, అలాగే నాగమణి కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ,మూడు ఎకరాల భూమి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా నాయకులు కోలేటి పకీరయ్య, నార్ల పాటి నాగేశ్వరావు నార్ల పాటి సిద్దయ్య ,అశోక్ వేల్పుల నాగమల్లేశ్వరరావు, చిలక రావు, నాగరాజు ,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## లోకకల్యాణం కోసం హెూమాలు మరియు శ్రీవారి కల్యాణం జరిపించిన పసురా గ్రూప్ అధినేత





మధిర, ఫిబ్రవరి 23, ప్రజాపాలన :మధిర సాయి బాబా దేవాలయంలో ఈ రోజున పసుర గ్రూప్స్ అధినేత పబ్బుతి మోహన్ రావు శ్రీ రక్షా సుదర్శన హెూమం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు అలాగే ఈరోజు సాయంత్రం 6 గంటలకు శ్రీవారి కల్యాణం జరుపుతూ స్వామి అనుగ్రహం లోక కళ్యాణము జరుపుటకు మరియు ఈ కళ్యాణ కైంకర్యము చేస్తున్న వారికి వారి కుటుంబమును వారి బంధువర్గాన్ని అలాగే లోక కళ్యాణం లో ఉన్న ప్రజలు అందరూ కూడా అష్టైశ్వర్యాలతో కలిగి ఉండాలని పసుర గ్రూప్స్ అధినేత పబ్బుతి మోహన్ రావు తెలిపారు ఈరోజు ఉదయం నుండి హెూమములు పూజా కార్యక్రమాలు జరిపించి భక్తులందరకు తీర్థ ప్రసాదాలు నియోగం జరిగింది

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోదండరాం ను గెలిపించాలి

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి ప్రస్తుతం జరుగనున్న నల్లగొండ,ఖమ్మం,వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రొపెసర్ కోదండరాం కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నియోజకవర్గ ఇంచార్జ్ సలీం పాషా పట్టభద్రులను కోరారు. ఈ సందర్భముగా ఆయన మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో,ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులను కలిసి కోదండరాం కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సునీల్,రాజు,పవన్ కుమార్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# చింతకాని మండలం పెద్ద గోపతి రైతులతో భట్టి ముఖాముఖి









మధిర, ఫిబ్రవరి 23, ప్రజాపాలన :పాములా కాటేస్తున్న మోదీ.. తేలులా కుట్టేందుకు వస్తున్న కేసీఆర్ ఇద్దరికీ కర్రు కాల్చి వాతలు పెట్టాలి పెద్దగోపతి రైతులతో ముఖాముఖి సభలో సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్కగారులి

జన సముద్రమైన పెద్దగోపతి పల్లె.. అడుగడుగునా భట్టికి జననీరాజనాలు పలికిన మహిళలు.. రైతులు..గ్రామ ప్రజలు.. భట్టికి... కోలాటాలతో.. గజ్జెకట్టి.. బోనమెత్తి.. అపూర్వ స్వాగతం పలికిన ఆడబిడ్డలుఇంత వరకూ ఎవరూ చేయని విధంగా అన్నదాతల సమస్యలు తెలుసుకునేందుకు పొలంబాట పట్టిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క.. తన యాత్రను సోమవారం ముగించారు. రైతుల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు 14 రోజుల నుంచి ముఖాముఖి యాత్రను ఆయన దాదాపు 2 వేల కిలోమీటర్ల మేర చేయడం గమనార్హం.

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మల్లు చేపట్టిన రైతులతో ముఖాముఖీ కార్యక్రమంలో ఖమ్మం జిల్లాలో సోమవారం విజయవంతంగా ముగిసింది. ఆదిలాబాద్ జిల్లా భీంసరి గ్రామంలో మొదలు పెట్టిన రైతులతో ముఖాముఖీ–పోరుబాట, పొలం బాట కార్యక్రమం ఖమ్మం జిల్లాలోని పెద్ద గోపతి రైతులతో మాట్లాడడంతో ముగిసింది. తెలంగాణ అంతటా పర్యటించి.. పలు నియోజకవర్గాల్లో రైతులతో ముఖాముఖి జరిపి.. అదే విధంగా రహదారి పొడవునా.. పొలాల్లో పనులు చేస్తున్న అన్నదాతలతో నేరుగా మాట్లాడి.. వారి సమస్యలను తెలుసుకున్నారు.

కొనుగోలు కేంద్రాలు, పావలావడ్డీ రుణాలు, వడ్డీలేని రుణాలు ఐకేపీ కేంద్రాలు ఎత్తేస్తే రైతుల భవిష్యత్ ఏమిటి? ఇలాంటి పరిస్థితులు ఎదరయితే.. రైతులు పంటలు పండిస్తారా? పంటలు బంద్ పెడితే.. ప్రజల పరిస్థితి ఏమిటని భట్టి విక్రమార్క మల్లు ఆగ్రహంగా ప్రశ్నించారు. రైతులతో ముఖాముఖి ముగింపు సందర్భంగా భట్టి విక్రమార్క పెద్దగోపతి సభలో మాట్లాడారు. ఆయనతో పాటు.. ఈ కార్యక్రమంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మల్లుతో పాటు ఎమ్మెల్యేలు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొదెం వీరయ్య, ఏఐసీసీ కార్యదర్శి మజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్, మాజీ ఎమ్మెల్సీపోట్ల నాగేశ్వర రావు, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాములా రైతులను కాటేసేందుకు వస్తోందని.. అలాగే తేలుగా కేసీఆర్ నక్కినక్కి రైతులను కుట్టేందుకు వస్తున్నారని చెప్పారు. ఇలాంటి పాములపై ములుగర్రను, తేలుపై చెప్పును ఎత్తాలని భట్టి ఆగ్రహంగా చెప్పారు. ఇలాంటి వారిని కొట్టకపోతే.. రైతులు తీవ్ర నష్టాల్లోకి కష్టాల్లోకి వెళ్లాల్సి వస్తుందన్నారు. రైతులు రోడ్ల మీదకు వచ్చి వీళ్లకు కర్రు కాల్చి వాతలు పెట్టాలని పిలుపునిచ్చారు. లేకపోతే మనల్ని మనం రక్షించుకోలేకమని భట్టి చెప్పారు. ఇదిలావుండగా.. కాంగ్రెస్ పార్టీ 2023లో అధికారంలోకి వస్తే.. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని సబ్సిడీలు కొనసాడిస్తామని భట్టి చెప్పారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కేసీఆర్ ఒక పెద్ద మూరు?దని భట్టి ప్రజలకు చెప్పారు. రైతులతో ముఖాముఖి అనేది ఒక రాజకీయ సభ కాదు.. ఇప్పుడు ఓట్లు లేవు.. ఇప్పుడున్న ప్రభుత్వాలకు మరో మూడేళ్ల అధికారం ఉంది.. కానీ.. వాళ్ల ఇష్టారీతిన పాలన చేసుకుంటూ పోతే.. రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఇబ్బందుల్లో పడతారు.. ఆ విషయాలను ప్రజలకు వివరించి.. వారి మధ్య చర్చ జరగాలని మాత్రమే ఈ కార్యక్రమం చేసినట్లు భట్టి చెప్పారు. పొలాల్లో.. గ్రామాల్లో.. అన్ని చొట్లా దీనిపై చర్చలు జరిగితేనే పరిష్కారాలు వస్తాయి చెప్పారు. రైతులతో ముఖాముఖి–పొలంబాట, పోరుబాట కార్యక్రమాల్లో అనేకచోట్ల రైతులు మవాళ్ల కష్టాల చెప్పినట్లు భట్టి వివరించారు. ప్రజాప్రతినధులు అందుబాటులో లేరు.. ఫసల్ బీమా యోజన రాలేదు.. రాష్ట్ర ప్రభుత్వం రూ.960 కోట్ల కట్టకపోవడం వల్ల మాకే బీమా రాలేదని ఆదిలాబాద్ జిల్లా రైతులు బాధపడ్డారిన భట్టి అన్నారు. అలాగే మంచిర్యాల రైతులు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని సబ్సీడీలను ఆపేసిందని అన్నారు. ఇప్పుడ కొనుగోలు కేంద్రాలు ఎత్తేస్తే.. మా పరిస్థితి అగమ్య గోచరమని అన్నట్లు చెప్పారు.

**శ్రీధర్ బాబు, మంథని ఎమ్మెల్యే**

రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబెట్టేందుకు సీఎల్పీ బృందం ప్రయత్నం చేస్తోంది. కేసీఆర్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఎత్తేసేందుకు సిద్ధమవుతోంది. ప్రతి పేదవాడికోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. కేంద్రం చీకటి చట్టాలను ప్రవేశపెట్టింది. రైతుల పక్షాన పోరాటం చేయాలి. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వంలో రైతుల పక్షాన పెద్ద ఉద్యమాన్ని నిర్మిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కిందకు దించాలి. డీజిల్ ధరలు రెండు రోజుకోసారి పెరగుతున్నాయి. రూ. 200 వరకూ పెరిగే ప్రమాదం ఉంది. డీజిల్ ధరలు పెరడం వల్ల రైతులకు తీవ్రస్థాయిలో నష్టం జరుగుతోంది. పెట్రోల్ ధరలు పెరగడం వల్ల సామాన్యులు నష్టపోతున్నారు. మూడు నల్ల చట్టాల వల్ల కనీస మద్దతు ధర రైతులకు ఉండదు. మద్దతు ధర లేకపోతే.. రైతులు తీవ్రంగా నష్టపోతారు. నా జిల్లాలో హత్య చేబడ్డ న్యాయవాద దంపతుల హత్యపై నిష్పక్షపాత విచారణ జరపాలి. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారిపోయారు. ఒక మహిళను నడిరోడ్డుపై హత్య చేస్తే.. ముఖ్యమంత్రి, మంత్రి కేటీఆర్.. ఎవరూ మాట్లాడరు.

**పొడెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే**

పోరాటం చేయకపోతే పొలాలు, భూమలు పోతాయి. రైతు వ్యతిరేక చట్టాల వల్ల అంబానీ, అదానీలు అక్కునే పరిస్థితులు వస్తాయి. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, మోడీ, కేసీఆర్ లను దించాలి. కేసీఆర్ ఒక పెద్ద దోపిడీ దొంగ. కేసీఆర్ యూటర్న్ తీసుకుని మోడీకి గులాం చేస్తున్న కేసీఆర్ కు తగిన బుద్ధి చెప్పాలి. లోఫర్ ప్రభుత్వాలను గద్దె దించకపోతే.. మనకు మనుగడ ఉండదు.

**మధు యాష్కి గౌడ్, ఏఐసీసీ సెక్రెటరీ**

ప్రజలతో ఏర్పడ్డ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన రైతు వ్యతిరేక విధానాలతో పొలంబాట పట్టాల్సిన రైతులు పోరుబాట పడుతున్నారు. కొత్త చట్టాలకు వ్యతిరేకంగా రైతుల పోరుబాట పడుతున్నారు. కేసీఆర్, మోదీలు.. ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. భయాందోళనలు సృష్టిస్తున్నారు. అక్రమాస్తులు కూడబెట్టుకుంటూ.. పాలన సాగిస్తున్నారు. రైతుబంధ పథకం ఇచ్చి వివిధ సబ్సీడీలను కేసీఆర్ ఆపేశాడు. రైతుబంధుతో రైతులను మోసం చేస్తున్న కేసీఆర్. అన్ని వర్గాల ప్రజలను కేసీఆర్ మోసం చేశాడు. ప్రశ్నిస్తే. అరెస్టులు.. ప్రశ్నిస్తే.. హత్యలు ఈ ప్రభుత్వం చేయిస్తోంది. న్యాయవాదులను నడిరోడ్డుపై హత్య వెనుక.. టీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. ప్రజాధనాన్ని కొల్లగొడుతు.. పాలన చేస్తున్నారు. కనీస మద్దతు ధర లేకపోతే దేశం విచ్ఛిన్నమవుతుంది. దౌర్భాగ్య కేసీఆర్ ప్రభుత్వాన్ని బొందపెట్టాల్సిందే.

**అన్వేష్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్**

రాష్ట్రంలో జరుగుతున్న రైతుల వ్యతిరేక విధానాలను రైతులకు వివరించేందుకు ఈ కార్యక్రమం. కేసీఆర్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి రైతులను నట్టేట ముంచింది. రైతురుణమాఫీ వల్ల రైతులకు జరిగింది ఏమీలేదు. రుణమాఫీ డబ్బులు వడ్డీలకే సరిపోయాయి. రుణమాఫీ జరకపోవడం వల్ల రైతులపై అదనపు భారం పడుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ ఇచ్చింది. పంట నష్టం పరిహారం కూడా కేసీఆర్ ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వడం లేదు. పంటల బీమా లేదు. పంట నష్టపరిహారమే.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రూ.930 కోట్లు రావాలి. మక్కలు.. సన్నాలను ప్రభుత్వం కొనకపోవడం వల్ల.. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వ మద్దతు ధర ఉంటేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వాలు కొనుగోలు ఆపితే రైతుల పరిస్థితి అగమ్య గోచరం. వర్సగాని క్రిష్ణయ్యటీఆర్ఎస్ పాలనలో రైతులు ఆగం అవుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఎత్తేస్తే ఎక్కడ అమ్ముకోవాలో తెలియని పరిస్థితి. కొట్లపల్లశ్రీనివాస రావుమాకు వచ్చింది వ్యవసాయమే మాకు ఎక్కడా మాఫీ కాలేదు. గిట్టుబాటు ధర లేదు. నేను రూ. 70 వేలు వ్యవసాయ రుణం తీసుకుంటే.. కట్టింది కూడా రూ.70 వేలు.. నాకు ఎక్కడా రుణమాఫీ కాలేదు. ఐకేపీ ఎత్తేస్తే.. మా బతుకులు ఆగమే. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. కొనుగోలు కేంద్రాలు కొనసాగించకపోతే.. ఉద్యమం చేయాలి. ఈ ప్రభుత్వాన్ని దించాలి.

**గోవిందరావు, రైతు**

నేను 20 ఎకరాలు మొక్కజొన్న వేసిన. వరి ఏసినా.. నాకు ఇబ్బందిగా ఉంది. వరి కొంటామని చెప్పిన ప్రభుత్వం కొనకపోవడంతో.. రూ.1200 లకు అమ్ముకోవాల్సింది. రైతుబంధు అవసరం లేదు.. మద్దతు ధర కావాలి. కూలీకి కూలీ గిట్టడం లేదు. విత్తనాల్లో మోసమే.. పెట్టుబడిలోనూ మోసమే.. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయం ఆపేస్తాం. పంటులు పండించడం నిలిపేస్తాం. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. వంద క్వింటాలు తీసుకుని రైతు ఎక్కడకు తీసుకెళ్లి అమ్ముకోవాలి? ఎంత దూరం పోవాలి. ప్రభుత్వం దిగి రైతుల కాడికి రావాలి. రైతులను ఎవరూ లెక్క చేయడం లేదు. ఒక్క ఏడాది మనం పంటలు పండించడం ఆపేస్తే.. ఎంతటివాడైనా దిగిరావాల్సిందే.

**కూరపాటి కిషోర్, రైతు**

మొక్కజొన్న వేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేపీ కేంద్రాలు ఎత్తేస్తాం.. మక్కలు కోనం అంటున్న ఈ ప్రభుత్వంతో యుద్ధం చేయాలి. కొనుగోలు కేంద్రాలు ఉండాల్సిందే. రైతు రుణమాఫీ కాలేదు. రుణమాఫీ కాకపోతే బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. దీంతో వడ్డీ వ్యాపారుల దగ్గరకు వెళ్లాల్సివస్తోంది. డ్రిప్ ఇరిగేషన్, పాలిహౌజ్ లు కూడా ఇవ్వడం లేదు. రైతులంతా పార్టీలకు అతీతంగా ప్రభుత్వంపై యుద్ధం చేయాలి.భట్టికి జనఘన స్వాగతం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మల్లు చేపట్టిన రైతులతో ముఖాముఖి కార్యర్యక్రమం ఆఖరి రోజున ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం కొణిజర్ల మండలం పెద్ద గోపతి గ్రామంలో జరిగింది. రైతులతో మాట్లాడేందుకు తమ గ్రామానికి వస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆయన టీమ్ కు పెద్ద గోపతి గ్రామ ప్రజలు అఖండ స్వాగతం పలికారు. దాదాపు మూడు కిలోమీటర్ల మేర భారీ ర్యాలీతో సీఎల్పీ నేత భట్టికి, ఇతర సీఎల్పీ బృందానికి స్వాగతం పలికారు. గ్రామ పొలిమేరకు చేరుకున్న భట్టికి మహిళలు కోలాటలతోనూ.. బతుకుమ్మల తోనూ తమ అభిమాన నాయకుల కు స్వాగతం చెప్పారు. రైతులతో ముఖాముఖీ కార్యక్రమంలో మహిళలు, రైతులు, పలు గ్రామాలు ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## పల్లా నామినేషన్ కి బ్రహ్మయ్య సారథ్యంలో భారీ సంఖ్యలో టిఆర్ఎస్ శ్రేణులు

పాలేరు ఫిబ్రవరి 23 ప్రజాపాలన:– ఖమ్మం–నల్గొండ– వరంగల్– ఎమ్మెల్సీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి నామినేషన్ సందర్భంగా పాలేరు నియోజకవర్గం నుంచి అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నేలకొండపల్లి మండలం నుంచి తెరాస మండల పార్టీ అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సుమారు 200 మంది కార్యకర్తలు పల్లా నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరారు.ఈ సందర్భంగా వున్నం బ్రహ్మయ్య, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ తెరాస పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి, ని అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. గ్రాడ్యుయేట్ లు మొదటి ప్రాధాన్యత ఓటు ను తెరాస అభ్యర్థి కి వేయాలన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం. లో అన్ని రంగాల్లో అభివృద్ధి లో దూసుకుపోతున్నమని మరింత అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే తెరాస అభ్యర్థులను గెలిపించుకుంటే నే సాధ్యమవుతుందని బ్రహ్మయ్య తెలిపారు. కార్యక్రమంలో నేలకొండపల్లి.



ఎంపీపీ వజ్జా రమ్య, జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, నేలకొండపల్లి రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శాఖమూరి సతీష్, నేలకొండపల్లి. పిఏసిఎస్. అధ్యక్షులు కోటి సైదా రెడ్డి , నర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు గండు సతీష్, వజ్జా శ్రీనివాస రావు, నెల్లూరి లీలా ప్రసాద్, మాజీ ఎంపీపీ నందిగామ కవితా రాణి, వెన్న బోయిన శ్రీను, నంబూరి సత్యనారాయణ, సర్పంచులు శ్రావణ్ కుమార్, భూక్య సుధాకర్, తదితరులు పాల్గొన్నారు

## మధిర నుంచి వామపక్షాల అభ్యర్థి నామినేషన్.. తరలి వెళ్లిన సిపిఐ నాయకులు



మధిర, ఫిబ్రవరి 23, ప్రజాపాలన : ఖమ్మం, వరంగల్, నల్గొండ ఎమ్మెల్సీ అభ్యర్థి జయసారథి రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి మధిర నుంచి నల్గొండకు తరలివెళ్లిన సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు మందడపు నాగేశ్వరరావు సిపిఐ మండల కార్యదర్శి ఓట్లు కొండలరావు ఖమ్మం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ సిపిఐ మండల నాయకులు అన్నవరపు సత్యనారాయణ చావా అవినాష్ ప్రవీణ్ నవీన్ హరి గోపాల్ తదితరులు నల్లగొండకు తరలించడం జరిగింది.


## ప్రజాపాలన

**జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.**

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | | | |
|---|---|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| డి. వరప్రసాద్ | - | తెల్లాపూర్ | - | 9553999990 |
| గణేష్ | - | బాలాపూర్ | - | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటచారి | - | మందమర్రి | - | 9440868581 |
| పి. లక్ష్మీనారాయణ గౌడ్ | - | కొల్చారం | - | 9912532909 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| టి. సురేష్‌చారి | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| అన్వర్ బాషా | - | కుత్బుల్లాపూర్ | - | 7993047109 |
| కళ్యాణ్ సి.ఎం. | - | కూకట్‌పల్లి | - | 7842672389 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| శైలజ | - | శేర్లింగంపల్లి | - | 8919627871 |
| సత్య కిషోర్ | - | సిద్దిపేట | - | 6309723472 |


## ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన మొండితోక



మధిర, ఫిబ్రవరి 23, ప్రజాపాలన : వచ్చే నెల 14న జరిగే %మీాజ% ఎన్నికల్లో విద్య వంతులు స్వేచ్ఛగా ఓటు హక్కుని సద్వినియోగం చేసుకోవాలని మధిర మునిసిపాలిటీ పరిధి లో 12 వ వార్డు లో లివాజీ మునిసిపాలిటీ చైర్పర్సన్ మొండితోక నాగరాణిసుధాకర్‌లి గారు అన్నారు. మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఓటు విలువ పై ఓటరు లకు పాట,, మాట,,ఆటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు అర్జునరావు,, పమ్మి రవి,,సిహెచ్ కోటేశ్వరరావు,, జి.సునీత,, ఎం. ముత్తయ్య,, కె.అపూర్వ తో పాటు వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం

### ఖమ్మం రీజినల్ మేనేజర్ సొలోమాన్




మధిర, ఫిబ్రవరి 23, ప్రజాపాలన : జిల్లాలో ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా రీజినల్ మేనేజర్ సోలోమన్ తెలిపారు మంగళవారం ఆయన మధిర డిపోలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్టిసి ఎండి ఆదేశాల మేరకు ఆర్టీసీలో పంచ సూత్రాలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్చి 1 నుండి ఖమ్మంలో నూతన బస్టాండ్ నుండి బస్సులు రాకపోకలు కొనసాగిస్తున్నాయని అని తెలిపారు ఖమ్మం పాత బస్ స్టాండ్ మూసివేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. మధిర నుండి జమలాపురం వరకు బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు విలేకర్ల సమావేశంలో మధిర డిపో మేనేజర్ దేవదానం పాల్గొన్నారు.

## రాజకీయ గురు చుట్టూ రాజకీయం

విశాఖపట్టణం, ఫిబ్రవరి 23, ప్రజాపాలన ప్రతినిధి :విశాఖపట్నంలో స్టీల్ ప్లాంట్ గురించి చెప్పుకుంటారు. బీచ్ గురించి కూడా మాట్లాడుకుంటారు. ఇక ఆధ్యాత్మికంగా చూడాలంటే పెందుర్తిలో ఉన్న శ్రీ శారదాపీఠం ఆశ్రమం గురించి కూడా చెప్పుకుంటారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామీజీకి భక్తులు ఎక్కువ. అంతకు మించి రాజకీయ భక్తులు ఇంకా ఎక్కువ. స్వామీజీ కూడా మిగిలిన వారి మాదిరిగా కాకుండా రాజకీయాల మీద ఎప్పటికపుడు బాగానే స్పందిస్తారు. పైగా దేశవ్యాప్తంగా ఆయనకు రాజకీయ నేతలతో పరిచయాలు కూడా ఉన్నాయి. పెందుర్తి శారదాపీఠానికి ఆధ్యాత్మిక పరిమళాలతో పాటు మరెంతో రాజకీయ ప్రాముఖ్యత కూడా ఉంది. ఇక్కడకు ఎందరో రాజకీయ పెద్దలు వచ్చి వెళ్తూంటారు. ఇక దివంగత ప్రధాని పీవీ నరసింహారావు లాంటి వారి నుంచి ఎందరో ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు కూడా ఈ పీఠాన్ని సందర్శించి స్వామీజీ ఆశీస్సులు అందుకున్నారు. ఇక శారదాపీఠం రెండళ్ల నుంచి మరో విధంగా కూడా ప్రాచుర్యం పొందింది. అదేంటి అంటే తెలంగాణాలో కేసీయార్ ని రెండవమారు సీఎం చేయడానికి స్వామీజీ చేసిన రాజశ్యామల యాగం బాగా ఉపయోగపడిందని పెద్ద ఎత్తున ప్రచారంలో ఉంది. అలాగే ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్ గెలవడానికి ఆయన కోసం కూడా స్వరూపానందేంద్ర స్వామీజీ పీఠంలో రాజశ్యామల యాగం చేశారు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకుల చూపు ఈ పీఠం మీద పడింది అంటున్నారుఇక కొద్ది నెలలలో ఎన్నికలు జరగబోతున్న తమిళనాడులో డీఎంకే పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి అధికారంలోకి రావాలనుకుంటోంది. ఇప్పటికి రెండు తడవలుగా ఓడిన డీఎంకేకి ఇవే చివరి అవకాశంగా చెప్పుకుంటున్నారు. దాని కోసం స్టాలిన్ అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇపుడు ఆయన ఆధ్యాత్మిక బాట కూడా పట్టారని అంటున్నారు. ఈ మధ్యనే స్టాలిన్ సతీమణి రహస్యంగా పీఠాన్ని సందర్శించి స్వరూపానందేంద్ర స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారని ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగుతోంది. స్టాలిన్ ఎన్నికల్లో గెలవాలని ఆ విధంగా ఆధ్యాత్మిక బలం తమకు దక్కాలని ఆమె కోరుకున్నట్లుగా తెలుస్తోంది.ఇదిలా ఉండగా మరో వైపు ఉత్తరప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీ దారుణంగా దెబ్బ తిని ఉంది. మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ కూడా 2022లో జరిగే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కావాలని పరితపిస్తున్నారు. ఆయన కూడా శారదాపీఠం గురించి విన్నారని, తొందరలో స్వరూపానందేంద్ర స్వామీజీ ఆశీస్సుల కోసం రావాలనుకుంటున్నారని కూడా అంటున్నారు. మొత్తానికి చూస్తే స్వామీజీ కోసం ఇతర రాష్ట్రాలకు చెందిన వారు అంతా క్యూ కడుతున్నారు. తమకు అధికార వైభోగం దక్కేలా ఏవైనా పూజలు చేయాలని కూడా గట్టిగా కోరుకుంటున్నారుట. ఈ పరిణామాలన్నీ చూస్తూంటే శారదాపీఠం రాజకీయంగా కూడా కీలకంగా దేశంలో మారుతోంది అని అర్థమవుతోంది.

## లక్షా 31వేల ఉద్యోగాలు ఇచ్చాం: పల్లా రాజేశ్వర్‌రెడ్డి



నల్లగొండ: త్యాగాల, పోరాటాల పురిటిగడ్డగా నిలిచిన ఈ జిల్లాలో పోరాట వారసులం తామని పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. నేడు ఆయన టీఆర్ఎస్ తరుపున నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లక్షా 31వేల ఉద్యోగాలు ఇచ్చారన్నారు. మోదీ కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారన్నారు. ఉద్యోగాల కల్పన తమదని... ఉద్యోగాలను తుంచేసింది బీజేపీ అని విమర్శించారు. 2014 నుంచి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే టీఆర్ఎస్‌ను గెలిపించాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు.

# ఆరువేలు దాటేసిన తెల్లబంగారం



వరంగల్, ఫిబ్రవరి 23, ప్రజాపాలన ప్రతినిధి :పత్తిని తెల్లబంగారమని చెప్పుకుని మురిసిపోతుంటాం...కానీ, అది రైతుకు కాదు.. వ్యాపారులకే అని ప్రస్తుత మార్కెటింగ్, ప్రభుత్వాల తీరునుబట్టి అర్థమవుతుంది. గతేడాది నవంబర్ 4న ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించింది. తేమ, నాణ్యత ఆధారంగా రూ.5,825 గరిష్ఠ ధరగా నిర్ణయించింది. 13 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు మొదలు పెట్టింది. 26,727 మంది రైతుల పేరుతో 7,69,759 క్వింటాళ్ల పత్తిని సీసీఐ ఒక్క ఖమ్మం జిల్లా పరిధిలోని కేంద్రాల్లోనే కొనుగోలు చేసింది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. ఇప్పుడు క్వింటాల్ పత్తి మార్కెట్లో రూ.6,200 వరకు ధర పలుకుతోంది. ఈ నెల ఆరంభంలో పత్తి ధరలు మద్దతు ధరను మించి నమోదయ్యాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో తొలిసారి ఫిబ్రవరి 3వ తేదీన సీసీఐకి మించి క్వింటాల్ పత్తి రూ.5,875 ధర పలికింది. నాటి నుంచి మొదలైన పెరుగుదల ఫిబ్రవరి 8న రూ.6,000 మార్క్ చేరింది. క్రమేణా పెరుగుతూ 18న రూ. 6,200కు చేరింది. పెరిగిన రేట్ల అందివుచ్చుకోవాలని ఆశించిన రైతుకు ఆశనిపాతమే మిగిలింది. పంట ఇప్పటికే చేయిదాటి పోవడంతో నైరాశ్యం అలుముకుంది.సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పుడు రైతులను మభ్యపెట్టి.. అధికారులతో కుమ్మక్కై అత్తెసరు ధరలు క్వింటాల్ రూ.3,000 నుంచి రూ.4,000 వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు పెరిగిన ధరలతో ఇప్పుడు లాభపడుతున్నారు. నాడు రైతుల వద్ద తక్కువ ధరకు కొన్న సరుకును జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులతో చేతులు కలిపి గరిష్ట ధర రూ.5,825కు అమ్ముకున్నారు. విదేశీ, దేశీయ మార్కెట్ తీరును అవగతం చేసుకున్న వ్యాపారులు అధికమొత్తం సరుకును నిల్వ చేసుకున్నారు. సీజన్ ఆరంభంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పోను రోజుకు సగటున 2,000 బస్తాల సరుకును రైతులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తరలించారు. ఇప్పుడు ధర పెరిగినా రైతుల చేతిలో సరుకు లేదు. కాబట్టి రోజుకు సగటున 500 బస్తాల పత్తి మాత్రమే మార్కెట్‌కు వస్తుంది. ఈ కొద్దిపాటి సరుకు కూడా వ్యాపారులదే కావడం గమనార్హం. ఖరీఫ్‌లో 1,01,675 హెక్టార్లలో జిల్లాలో రైతులు పత్తి సాగు చేశారు. 2,26,130 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం మేరకు 13 కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది. జిన్నింగ్ మిల్లుల దగ్గర 7,17,518 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. ఖమ్మంలో సీసీఐ అధికారులు మరో 1,53,540 క్వింటాళ్లను కొనుగోలు చేశారు. ఇవిగాక ప్రయివేటు వ్యాపారులు వివిధ మార్కెట్లలో 1,63,118 క్వింటాళ్లు, ఖమ్మంలో 1,12,878 క్వింటాళ్లను కొన్నారు. ఒక్కో ఎకరానికి రూ.30వేల వరకు రైతు పెట్టుబడి పెట్టి పంట పండిస్తే.. అధికవర్షాల కారణంగా వారికి వచ్చిన దిగుబడి ఎకరానికి 4నుంచి 5 క్వింటాళ్లు మాత్రమే. సీసీఐ నిర్దేశించిన ధర రూ.5,825 చొప్పున రైతు క్వింటాల్ పత్తి అమ్ముకున్నా... పెట్టిన పెట్టుబడులు సైతం రావు. అలాంటిది దళారులు రైతులను మభ్యపెట్టి సగటున క్వింటాల్ రూ.4,000కు మించి ధర పెట్టని పరిస్థితి ఈ ఏడాది మనం మార్కెట్లో చూశాం. దీన్నిబట్టి రైతు ఒక్కో ఎకరానికి రూ.10వేలకు పైగా నష్టపోయాడు. పంట ఉత్పత్తి నిలిచిపోవడంతో దాదాపు 80శాతం మంది రైతులు పత్తి చెట్లను తొలగించి రబీ పంటలు సైతం వేసుకున్నారు. ఈ ఏడాది పంట ఉత్పత్తి సరిగా లేకపోవడంతో అంతర్జాతీయంగా పత్తికి డిమాండ్ ఏర్పడింది. క్యాండిల్స్, గింజలు గతం కంటే ఎక్కువ రేట్లు పలుకుతున్నాయి. గతంలో 40వేలున్న క్యాండిల్ ధర రూ.47,000, గతంలో క్వింటాల్ రూ.2,000 ఉన్న గింజలు ఇప్పుడు రూ.3,000 వరకు అమ్ముడుబోతున్నాయి. పత్తి దిగుబడి బాగా తక్కువ వచ్చింది. పంట చేయిదాటాక ఇప్పుడు అధిక రేట్లకు అమ్ముడవుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం 15 లక్షల బేళ్ల పత్తి ఎగుమతులకు అనుమతి చ్చింది. తద్వారా పంట రేట్లు పెరిగాయి. ఈ ఎగుమతి అనుమతులేవో పంట రైతుల చేతిలో ఉన్నప్పుడు ఇచ్చి ఉంటే వారు లబ్ది పొందేవారు. కానీ ఇప్పుడివ్వడం వల్ల వ్యాపారులు లాభపడుతున్నారు. ఈ నేపథ్యంలో సీసీఐకి పంట విక్రయించిన ప్రతి రైతుకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని కోరుతున్నారు.

# మహారాష్ట్ర నుంచి జిల్లాలకు కరోనా భయం

అదిలాబాద్, ఫిబ్రవరి 23, ప్రజాపాలన ప్రతినిధి :ఏడాది కాలంగా ముప్పుతిప్పలు పెడుతున్న కరోనా మహమ్మారి భయం ఇంకా వీడడం లేదు. 2020 ఏడాది మొత్తం కరోనా భయంతోనే గడిచిపోయింది. తాజాగా 2021లోనూ ఇంకా దీని ప్రభావం పూర్తిగా తొలగి పోనప్పటికీ కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో ప్రజలు కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఎక్కడినుంచి ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందోనని జనం ఇంకా ఆందోళనతోనే ఉన్నారు. ఈ రెండు నెలల నుంచి కరోనా ఉధృతి తగ్గిందని కొంత ఉపశమనం పొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావాసులకు పొరుగు భయం వెంటాడుతోంది. జిల్లా సరిహద్దున ఉన్న మహారాష్ట్రలో రెండో దశ కరోనా వైరస్ తీవ్రరూపం దాల్చడంతో ఆ ప్రభావం జిల్లాపై పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. విదర్భ ప్రాంతంలోని యవత్‌మాల్, ఆకోలా తదితర జిల్లాల్లో వేల సంఖ్యలో కేసులు నమోదు కావడంతో ఈ ప్రభావం జిల్లాపై పడే అవకాశం ఉంటుందని అధికార యంత్రాంగం భావిస్తోంది. ముందస్తుగా అప్రమత్తమై నివారణ చర్యలకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే జిల్లాలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌లో 55 శాతం మందికి టీకా వేయడం పూర్తి కాగా సోమవారం నుంచి ప్రయివేటు వారికి అందించేందుకు సిద్ధమవుతోంది. కరోనా వైరస్ కారణంగా ఇప్పటివరకు జిల్లాలో 2.37 లక్షల మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 5130 మందికి పాజిటివ్ వచ్చినవారిలో చాలామంది కోలుకున్నారు. పరిస్థితి క్షీణించి పలువురు మృతిచెందారు. నెమ్మదిగా పరిస్థితి కుదుటపడింద నుకుంటున్న సమయంలో ఇప్పుడు మళ్లీ మహారాష్ట్రలో కరోనా విజృంభిస్తుంది. ఒక్క రోజులో 6 వేల కేసులు నమోదు కాగా, 44 మంది చనిపోయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. కరోనా తీవ్రస్థాయిలో ఉండటంతో పొరుగునే ఉన్న జిల్లాపై ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. లాక్‌డౌన్ నిబంధనలు సడలించడంతో ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు మొదలయ్యాయి. బస్సులు, ప్రయివేటు వాహనాలు తిరుగుతున్నాయి. జిల్లా సరిహద్దున అనేక గ్రామాల ప్రజలకు విదర్భ ప్రాంత ప్రజలకు సత్సంబంధాలు, బంధుత్వాలున్నాయి. ఫంక్షన్లకు కూడా వెళ్లి వస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో జనాలు వివిధ పనుల నిమిత్తం సరిహద్దు దాటి జిల్లాకు రావడం, పోవడం చేస్తున్నారు. తాజాగా కరోనా కేసులు పెరుగుతుండటంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. యవత్‌మాల్ జిల్లాలో రాత్రి వేళలో కర్ఫ్యూ అమలు చేస్తున్నట్టు తెలుస్తోంది. కేసులు మరింత పెరిగితే పూర్తిగా లాక్‌డౌన్ విధించే అవకాశం ఉందని సమాచారం. అప్రమత్తమైన యంత్రాంగంకొన్ని రోజులుగా పక్కనే ఉన్న మహారాష్ట్రలో మళ్లీ కరోనా విజృంభించడంతో సరిహద్దునున్న జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. టీకా వచ్చిన తర్వాత ఆయా శాఖలకు చెందిన కరోనా యోధులు 6913 మందిని గుర్తించి 3276 మందికి టీకా వేశారు. మరో 435 మంది ప్రయివేటు వ్యక్తులకు టీకా అందించినట్టు అధికారులు చెబుతున్నారు.మహారాష్ట్రలో చోటు చేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్న అధికారులు జిల్లావాసులు మరోసారి కరోనా బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై శనివారం వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ముందస్తుగా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై ప్రణాళిక రూపొందించినట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. సరిహద్దున ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్రమత్తం చేశారు. ఎవరైనా మహారాష్ట్ర నుంచి ఎవరైనా జిల్లాలోకి ప్రవేశిస్తే వెంటనే సమాచారం అందించాలని స్పష్టం చేశారు. వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు. జిల్లావాసులు కరోనా నిబంధనలు పాటిస్తేనే దీని బారి నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది. మాస్కులు ధరించడం, శానిటైజర్ వినియోగించడం, భౌతికదూరం పాటించడం లాంటివి కొనసాగించాలని సూచిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే విపత్కర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని

## ట్రాక్టర్ లతో మారుతున్న రూపు రేఖలు

మెదక్, ఫిబ్రవరి 23, :పల్లెలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. గ్రామాలను అభివృద్ధికి నమూనాగా మార్చేందుకు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతున్నది. ఇందులో భాగంగా గ్రామాలను స్వచ్ఛతకు చిరునామాగా మార్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టి వినూత్న ఒరవడికి నాంది పలికారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములై ముందుకు కదిలేలా పల్లె ప్రగతి కార్యక్రమాన్ని తీర్చిదిద్దారు. ఏడాదిన్నరగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గ్రామాల్లో విజయవంతంగా అమలవుతున్నది. నిర్విరామంగా కొనసాగుతున్న పనులతో పల్లెలు స్వచ్ఛంగా మారాయి. చెత్త సేకరించడం, మొక్కలకు నీళ్లు పట్టి సంరక్షించడం, ముళ్ల పొదలను తొలగించడం కోసం పంచాయతీలకు ట్రాక్టర్లను అందజేశారు. ట్రాక్టర్ల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నిధులను వినియోగించారు. దీంతో పంచాయతీలకు సొంతంగా వాహనాలు సమకూరాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతి జీపీకి ట్రాక్టర్ ఓ ఆస్తిగా మారింది.ఏడాదిన్నర క్రితం వరకు గ్రామాల్లో చెత్త సేకరణ, మురికి కాలువల శుభ్రం చేసేందుకు సరైన వ్యవస్థ ఉండేది కాదు. పల్లె ప్రగతి అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ తప్పనిసరి చేయడంతో పాలకవర్గాలు తీర్మానం చేసి వాహనాలను కొనుగోలు చేశాయి. జనాభా ఆధారంగా వాహనాల సామర్థ్యాన్ని బట్టి ట్రాక్టర్లు జీపీలకు తీసుకొచ్చారు. ట్రాక్టర్ ఇంజిన్‌తోపాటు ట్రాలీ, ట్యాంకర్ ఏర్పాటు చేసుకోవడంతో జీపీలకు బలం చేకూరింది. ఒక రోజంతా వంద మంది చేసే పనిని ట్రాక్టర్ ద్వారా గంటల వ్యవధిలోనే చేసే అవకాశం లభించడంతో గ్రామాల్లో పనుల నిర్వహణ సులువుగా మారింది. రోడ్లకు ఇరువైపులా, వీధుల్లో మొక్కలు నాటి ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. దీంతో నాటిన మొక్కల్లో అధిక శాతం పెరుగుతున్నాయి. గతంలో మొక్కలకు నీళ్లు అందించేందుకు సరైన వ్యవస్థ లేదు. ప్రస్తుతం ట్రాక్టర్ అందుబాటులోకి రావడంతో ఇబ్బందులు తప్పాయి. గ్రామంలో ఇంటింటికీ చెత్త సేకరణకు ట్రాక్టర్ వినియోగిస్తున్నారు. సేకరించిన చెత్తను కంపోస్ట్‌షెడ్‌కు తరలించి సేంద్రియ ఎరువుగా మారుస్తున్నారు. ట్రాక్టర్ కొనుగోలు ప్రక్రియ జీపీకి భారం కాకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధులను లెక్కగట్టి ట్రాక్టర్ విలువలో సుమారు 40 శాతం సొమ్ము చెల్లించడం, 60 శాతం బ్యాంకుల నుంచి రుణం పొందేలా చర్యలు తీసుకున్నారు. ట్రాక్టర్ ద్వారా పంచాయతీ పరిధిలో కొంత మందికి ఉపాధి లభిస్తోంది. ప్రతి పంచాయతీకి ట్రాక్టర్ కేటాయించినపుడు డ్రైవర్, పారిశుధ్య కార్మికులను నియమించుకునే సౌలభ్యం కలిగింది. నిజామాబాద్ జిల్లాలో 530 గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లు పూర్తి స్థాయిలో సమకూర్చారు. కామారెడ్డి జిల్లాలో 526 గ్రామ పంచాయతీలకు గాను ఇదివరకే 3 జీపీలకు ట్రాక్టర్లుండగా... ఏడాదిన్నర క్రితం 523 జీపీలకు ట్రాక్టర్లు కొత్తగా కొనుగోలు చేశారు. వీటిలో 513 జీపీల్లో ట్రాలీలు, 526 జీపీల్లో ట్యాంకర్లు సైతం అందుబాటులో ఉన్నాయి.గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు సమకూర్చడంతో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ, మొక్కలకు నీళ్లు పోయడం, ముళ్ల పొదలను తొలగించే ప్రక్రియ సులువుగా మారింది. ప్రజలకు మేలు చేసే ఏ అవసరానికైనా ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారు. మనుషులు చేయలేని పని ట్రాక్టర్ల ద్వారా చేస్తున్నారు.

# తెలంగాణలోనూ సోషల్ ఇంజనీరింగ్




హైదరాబాద్, ఫిబ్రవరి 23, :తెలంగాణ రాజకీయాల్లో కులాల ప్రస్తావన, ప్రాధాన్యం తక్కువ. కానీ పార్టీలు మాత్రం సామాజికవర్గాలపై ఫోకస్ పెడుతున్నాయి. ఓ బీసీ సామాజికవర్గాన్ని తమవైపు తిప్పుకోవడానికి ప్రధాన పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఆంధ్రాతో పోలిస్తే తెలంగాణ రాజకీయాల్లో కులాలకు అంతగా ప్రాధాన్యం ఉండదు. ఇక్కడ మొదటి నుంచి రెడ్లు, వెలమల ఆధిపత్యం ఉన్నప్పటికీ.. సామాజిక వర్గాలకు అతీతంగా ఇక్కడి రాజకీయాలు సాగుతాయి. కానీ తెలంగాణలోనూ మెల్లగా సామాజికవర్గాల కోణంలో రాజకీయాలు చేయుడం మొదలైంది. ఏపీ స్థాయిలో కులాభిమానం ఇక్కడ లేకపోయినా.. రాజకీయ పార్టీలు మాత్రం సామాజిక వర్గాల కోణంలో ఆలోచిస్తున్నాయి. తెలంగాణ జనాభాలో సగం వాటా బీసీలదే. బడుగు వర్గాలు ఎటు మొగ్గితే అధికారం ఆ పార్టీదే. ఈ విషయం తెలుసు కాబట్టే పార్టీలు బీసీలను ఆకర్షించే ప్రయత్నాల్లో ఉన్నాయి. బీసీల్లోనూ జనాభాపరంగా ఎక్కువ సంఖ్యలో ఉన్న మున్నూరు కాపుల వైపు తెలంగాణలోని రాజకీయ పార్టీలు చూస్తున్నాయి.వాస్తవానికి కాపుల ప్రాబల్యం ఆంధ్రాలో ఎక్కువ. ఏపీ రాజకీయాల్లో కమ్మ, రెడ్డి అనే రెండు బలమైన సామాజిక వర్గాలు ఉన్నప్పటికీ.. కాపుల జనాభా ఎక్కువ. దీంతో అక్కడి పార్టీలు కాపులను మచ్చిక చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను మనం చూస్తూనే ఉన్నాం. తెలంగాణ విషయానికి వస్తే బీసీ జాబితాలో ఉండే మున్నూరు కాపుల జనాభా కూడా ఎక్కువే.తెలంగాణ రాజకీయ పక్షాలు మున్నూరు కాపులకు ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టాయి. టీఆర్ఎస్ ఈటల, కే కేశవరావుకు మొదటి నుంచి తగిన ప్రాధాన్యం ఇస్తోంది. బీజేపీ తెలివిగా తెలంగాణ అధ్యక్ష పదవిని ఈ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే కట్టబెట్టింది. ధర్మపురి అరవింద్, గతంలో పార్టీ అధ్యక్షుడిగా పని చేసిన లక్ష్మణ్‌ది సైతం ఇదే సామాజిక వర్గం. మున్నూరు కాపులను ఆకట్టుకోవడంతోపాటు.. ఆంధ్రా నుంచి వచ్చి ఇక్కడి సెటిలైన కాపులు, తెలంగాణలోని బీసీ వర్గాలను ఆకట్టుకోవడానికి బీజేపీ ఈ ఎత్తుగడ వేసింది.మున్నూరు కాపులను తమవైపు తిప్పకోవడం కోసం కాషాయ పార్టీ వ్యూహాలను పసిగట్టిన టీఆర్ఎస్ సైతం అందుకు తగ్గటుగానే ప్రతి వ్యూహాలు రచిస్తోంది. కరీంనగర్‌లో ఇంటా బయట పోరుకు చెక్ పెట్టడం కోసం ఇదే సామాజిక వర్గానికి చెందిన గంగుల కమలాకర్‌కు మంత్రి పదవి అప్పగించింది. నిజామాబాద్‌లోనూ ఈ వర్గానికే చెందిన బాజిరెడ్డి గోవర్ధన్ టీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు.గత జీహెచ్ఎంసీ మేయర్‌గా ఈ సామాజిక వర్గానికి చెందిన బొంతు రామ్మోహన్‌ను కేసీఆర్ ఎంపిక చేశారు. అప్పుడు ఆయనకు ఆ పదవి దక్కడానికి ఉద్యమ నేపథ్యమే ప్రధాన కారణం. కాగా 2021లో మేయర్‌గా గద్వాల విజయలక్ష్మిని ఎంపిక చేశారు. ఈమె సైతం మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందినవారే కావడం గమనార్హం. కేకే కూతురు కావడం.. బీసీ సామాజికవర్గానికి చెందిన మహిళ కావడంతోనే ఆమెకు ఈ పదవి దక్కింది. వాస్తవానికి ఈ పదవిని రెడ్డి సామాజికవర్గానికి అప్పగించాలని తొలుత భావించారట. ఇలా.. అధికార టీఆర్ఎస్, బీజేపీ బీసీలను ముఖ్యంగా మున్నూరు కాపులను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.



# వెంకీతో దృశ్యం 2 లాల్‌తో దృశ్యం 3కి అతడే..!



సూపర్ స్టార్ మోహన్ లాల్ - మీనా ప్రధాన పాత్రలు పోషించిన దృశ్యం మలయాళంలో సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత తెలుగు-తమిళంలోనూ రీమైకై పెద్ద హిట్టు కొట్టింది. తొలి భాగం బ్లాక్ బస్టర్ కొట్టాక దృశ్యం 2 ని ప్రకటించారు. ఇటీవల అమెజాన్ ప్రైమ్ లో దృశ్యం 2 రిలీజై విజయం సాధించింది. పార్ట్ 2ని కూడా జీతూ జోసెఫ్ ఎంతో ఎమోషనల్ డ్రామాతో తెరకెక్కించారని టాక్ వినిపించింది. ఓటీటీలో చక్కని ఆదరణ దక్కించుకుంటోంది. ఆ క్రమంలోనే ఇప్పుడు పార్ట్ 3ని కూడా తెరకెక్కించేందుకు సన్నాహాలు చేయనున్నారు. తొలి రెండు సినిమాల్ని తెరకెక్కించిన జీతూనే ఇప్పుడు పార్ట్ 3కి కూడా దర్శకత్వం వహించనున్నారు. మంచి కాస్టింగ్ ఎంపిక ఉంటుందని ఆయన ప్రకటించారు. ఇప్పటికే విజయం సాధించిన దృశ్యం 2లో నటించేందుకు విక్టరీ వెంకటేష్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా దీనికి కూడా జీతూ జోసెఫ్ దర్శకత్వం వహిస్తారని సమాచారం. ఇరుగు పొరుగు భాషల్లోనూ ప్రపోజల్స్ లో కాస్టింగ్ కుదిరితే రీమేకయ్యే వీలుంది. జార్జ్ కుట్టి తన కుటుంబం కోసం ఎప్పుడూ ప్రమత్తంగానే ఉండాలి. రాబోయే ఆపదను కనిపెట్టి కుటుంబాన్ని కాపాడుకోవాలి!! అన్న ముగింపుతో సీక్వెల్ రక్తి కట్టించింది. అప్పుడే పార్ట్ 3 ఉంటుందని ప్రేక్షకులు అంచనా వేశారు. ఎట్టకేలకు దర్శకుడే మూడో భాగం గురించి ప్రకటించారు.

# కొరటాలతో మరో సినిమా.. ఎన్టీఆర్ లైనప్ అదిరిపోయిందిగా..!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న 'ఆర్.ఆర్.ఆర్' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే.
దసరా కానుకగా అక్టోబర్ 13న ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సినిమాతో దేశ వ్యాప్తంగా క్రేజ్ తెచ్చుకోనున్న తారక్.. దాన్ని నిలబెట్టుకునే విధంగా సినిమాలను లైన్ లో పెడుతున్నాడు. ఇప్పటికే త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ సినిమా కమిట్ అయ్యాడు. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని ఎంటర్టైన్మెంట్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. తారక్ 'ఆర్.ఆర్.ఆర్' షూట్ కంప్లీట్ చేసిన వెంటనే 'ఎన్టీఆర్30' సినిమాని స్టార్ట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే క్రమంలో 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ ఓ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ చేయనున్నాడు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా లెవల్ లో మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మించనున్నారు.
దీని తర్వాత 'జనతా గ్యారేజ్' వంటి సూపర్ హిట్ ఇచ్చిన కొరటాల శివ తో తారక్ మరో సినిమా చేయనున్నాడట.
దీంతో పాటే తన సోదరుడు కళ్యాణ్ రామ్ తో కలిసి ఓ సినిమా ఉంటుందని సమాచా రం. ఈ ప్రాజెక్ట్ కి ఇంకా దర్శకుడు డిసైడ్ అవ్వలేదు కానీ ఇది హోమ్ బ్యానర్ లోనే ఉంటుందని టాక్ నడుస్తోంది. ఇదంతా చూసుకుంటే యంగ్ టైగర్ డేట్స్ 2024 వరకు ఖాళీ లేవనే అనుకోవాలి.

# కేజీఎఫ్-2 తెలుగు రైట్స్.. బాప్ రే అన్ని కోట్లా..?



దేశవ్యాప్తంగా ఇండియన్ ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్న సినిమాల్లో ముందు వరసలో ఉంది 'కేజీఎఫ్-2'. కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా.. దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్ మొదటి పార్ట్ అద్భుతమైన విజయం సాధించింది. దీంతో సెకండ్ పార్ట్ పై ఓ రేంజ్ లో హైప్ క్రియేట య్యింది. ఈ హైప్ ను క్యాష్ చేసుకునే పనిలో పడ్డారు మేకర్స్. ఎంత ధర నిర్ణయించినా.. కేజీఎఫ్-2ను హాట్ కేకులా అందుకు నేందుకు చూస్తున్నారట పంపిణీ దారులు! దీంతో.. ఈ చిత్ర బిజినెస్ ఆకాశాన్ని తాకుతున్నట్టుగా వార్తలు వింటూనే ఉన్నా. దేశంలోని అన్ని ప్రధాన భాషల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో తెలుగు హక్కులకు కూడా తీవ్ర పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని సొంతం చేసుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు ఎంత చెల్లించడా నికైనా సిద్ధంగా ఉన్నారనే ప్రచారం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఓ ఇంట్రస్టింగ్ న్యూస్ బయటకు వచ్చింది. కన్నడ సినీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమా తెలుగు హక్కులను దిల్ రాజు సొంతం చేసుకున్నారట. ఇందుకు గానూ రూ.66 కోట్లు చెల్లించినట్టు తెలుస్తోంది. మరి ఈ వార్తలో ఎంతవరకూ నిజముందో కానీ.. అటు శాండవుల్ ఉడ్ ఇటు టాలీవుడ్ లో మాత్రం న్యూస్ వైరల్ అయ్యింది. తొలి పార్టు ఘనవిజయం ఆ తర్వాత టీజర్ ప్రపంచ రికార్డు నెలకొల్పడం వంటి కారణాలతో కేజీఎఫ్-2పై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో.. పంపిణీదారులు కూడా వెనకడాట్లేదు. కాగా.. ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా జూలై 16న గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది.

# బడా నిర్మాత కోరిక బాలయ్య తీరుస్తాడా..?



సినీ ఇండస్ట్రీలో నిర్మాతల పాత్ర ఎంత ఉంటుందో అందరికి తెలిసిందే. నిర్మాత తర్వాతే అందరికి క్రెడిట్ లభిస్తుంది. అయితే గొప్పగొప్ప నిర్మించిన నిర్మాతలకు కూడా చాలా డ్రీమ్స్ ఉంటాయి. ఓ నిర్మాత కావచ్చు లేదా దర్శకుడు కావచ్చు.. ఎంత డబ్బు ఉన్నా అనుకున్న సినిమాలు తీయలేక పోయాననే బాధ అందరిలోనూ ఉంటుంది. అది బడా ప్రొడ్యూసర్ అయినా అప్కమింగ్ ప్రొడ్యూసర్స్ అయినా బయటికి చెప్పకపోవచ్చు కానీ ఏదొక రోజు బయటపెట్టక తప్పదు. అయితే టాలీవుడ్ ఇండస్ట్రీ నుండి దాదా సాహెబ్ అవార్డు అందుకున్న గొప్ప నిర్మాత డి.రామానాయుడు. సురేష్ ప్రొడక్షన్స్ అధినేతగా ఆయన ఎన్నో విజయవంతమైన సినిమాలను రూపొందించారు. అలాగే ఇండియాలోని అన్ని భాషలలో సినిమాలు నిర్మించి ఆయన కోరిక నెరవేర్చుకున్నారు. అయితే ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ ప్రొడ్యూసర్గా పాపులర్ అయ్యాడు దిల్ రాజు. ఫ్యామిలీ ప్రేక్షకులను దృష్టి లో పెట్టుకొని దిల్ రాజు సినిమాలను నిర్మిస్తుంటాడు. అలాగే మొదటి నుండి ఫ్యామిలీ ప్రేక్షకుల మన్ననలు పొందుతూ ఇప్పుడు టాలీవుడ్ లో బడా నిర్మాతగా కొన సాగుతున్నాడు. అయితే టాలీవుడ్ ఇండస్ట్రీ లోని అందరు హీరోలతో దిల్ రాజు సినిమాలు నిర్మించాడట. కానీ ఇప్పటికి ఆయనకు తీరని కోరిక ఏంటంటే.. ఓ బడా హీరోతో ఒక్క సినిమా కూడా చేయకపోవ డమే. అవును టాలీవుడ్ హీరో లందరితో సినిమాలు చేసిన దిల్ రాజు.. నట సింహం నందమూరి బాలకృష్ణతో ఒక్క సినిమా కూడా చేయలేదు. బాలయ్యతో సినిమా చేయడమే ఆయన చిరకాల కోరిక అంటూ మనసులో మాట బయట పెట్టినట్లు వార్తలు వైరల్ అవుతు న్నాయి. కేవలం బాలకృష్ణ అక్కినేని అఖిల్ లతో దిల్ రాజు సినిమాలు చేయలేదట. అయితే ప్రస్తుతం అఖిల్ రెండు సినిమాలతో బిజీగా ఉండటం తో బాలయ్యతో నెక్స్ట్ సిని మా చేయాలనే తపనతో ఉన్నాడట. బాలయ్య - అనిల్ రావిపూడి దర్శ కత్వంలో దిల్ రాజు ప్లాన్ చేయను న్నట్లు తెలుస్తుంది. చూడాలి మరి దిల్ రాజు కోరిక ఎప్పుడు ఫుల్ ఫిల్ అవుతుందో!

# ఫేక్ కలెక్షన్స్ విమర్శలతో 100 కోట్ల పోస్టర్ ని పక్కన పెట్టారా..?



మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్ - కృతిశెట్టి జంటగా తెరకెక్కిన చిత్రం ''ఉప్పెన''. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ - సుకుమార్ రైటింగ్స్ ఈ చిత్రాన్ని రూపొందించాయి. ఇటీవల విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల మన్ననలను అందుకోవడంతో పాటు మంచి వసూళ్ళు రాబడుతోంది. హీరోహీరోయిన్ల నటన - విజయ్ సేతుపతి - దేవిశ్రీ ప్రసాద్ అందించిన సంగీతం ఈ సినిమాకు ప్లస్ అయ్యాయి. సక్సెస్ కి కారణాలేవైనా నిర్మాతల్లో ఒకరైన సుకుమార్ 'ఉప్పెన' 100 కోట్ల సినిమా అవుతుందని స్టేట్మెంట్ కూడా ఇచ్చాడు. దీనికి తగ్గట్టుగానే ఈ సినిమా ఫస్ట్ వీక్ లోనే 70 కోట్లు వసూలు చేసినట్లు మేకర్స్ అధికారికంగా పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. వాస్తవానికి 'ఉప్పెన' సినిమా ఇప్పటి వరకు థియేటర్స్ నుంచి దాదాపుగా 65 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అంటే సుమార్ 32 కోట్లు షేర్ రాబట్టినట్లు అవుతుంది. లెక్కలు చూసుకుంటే ఈ సినిమా ఆల్రెడీ లాభాల్లోనే ఉంది.
నాన్ థియేట్రికల్ రైట్స్ ద్వారా సుమారు 20 కోట్లు వచ్చినా ఈ సినిమా 50 కోట్లు తెచ్చిపెట్టినట్లేనని చెప్పవచ్చు. ఇకపోతే సక్సెస్ ఫుల్ గా సెకండ్ వీక్ లో అడుగుపెట్టిన ఈ సినిమా వంద కోట్లు కలెక్ట్ చేస్తుందా లేదా అనేది పక్కనపెడితే సుక్కూ స్టేట్మెంట్ తో చిత్ర యూనిట్ 100 కోట్ల పోస్టర్ కూడా రెడీ చేసుకున్నారట. అయితే ఇటీవల కలెక్షన్స్ ఫేక్ చేస్తున్నారనే విమర్శలు రావడంతో 100 కోట్లు పోస్టర్ ని ప్రస్తుతానికి వేయకూడదని మైత్రీ అండ్ టీమ్ నిర్ణయించుకున్నట్లుగా సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది.


## మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)

జై భీం,

మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?

**అయితే రండి, కదలి రండీ**

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,

Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004

E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989